

నిర్లక్ష్యంగా..

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధమైంది. దీపావళి పండుగ తర్వాత వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముందస్తుగా వరినాట్లు పూర్తి చేసిన కంకిపాడు మండలం, వెద పద్ధతి సాగు చేసిన బంటుమిల్లి, పెడన, గూడూరు, మచిలీపట్నం, పామర్రు తదితర ప్రాంతాల్లోని పైరు వరి కోతకు సిద్ధమవుతోంది. అయితే ధాన్యం కొనుగోలులో కీలకంగా ఉన్న మిల్లర్లు ప్రభుత్వానికి ఎంతమేర సహకరిస్తారనే అంశంపై సందిగ్ధం నెలకొంది. బుధవారం నాటికి బ్యాంకు గ్యారెంటీలు చూపాలని అధికారులు ఆదేశాలు ఇచ్చినా చూపకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బ్యాంకు గ్యారెంటీలు చూపని రైస్ మిల్లర్లు

నెలాఖరు నాటికి వరి కోతలు ప్రారంభం!

- జిల్లాలో 165 మిల్లులు.. డ్రయ్యర్ సౌకర్యం ఉన్నవి 75
- నేటిలోగా బ్యాంకు గ్యారెంటీ చూపాలని గతంలోనే అధికారుల ఆదేశాలు
- కావాలనే జాప్యం చేస్తున్న మిల్లు యజమానులు!



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా వ్యాప్తంగా 165 రైస్‌మిల్లులు ఉన్నాయి. వీటిలో డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులు 75 వరకు ఉన్నాయి. నవంబరు మొదటి వారం నుంచి ముందస్తుగా వరినాట్లు వేసిన పొలాల్లో వరి కోతకు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఈ ఏడాది వారం, పది రోజుల ముందుగానే ధాన్యం కొనుగోళ్లు జిల్లాలో ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఈ నెల 15వ తేదీలోగా మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీ (బీజీ)లు చూపాలని ఆదేశాలు జారీ చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం బిల్లులు సకాలంలో చెల్లించాలంటే మిల్లు యజమానులు ముందస్తుగానే బీజీలు చూపాల్సి ఉంది. మిల్లుల ఖాతాల్లో నగదు ఉంటేనే ప్రభుత్వం ధాన్యం బిల్లులు చెల్లించేందుకు సర్వర్ సహకరిస్తుంది. ధాన్యానికి రైతులు ఆశించిన మద్దతు ధర ఇచ్చే జిల్లాలోని ఏ మిల్లుకైనా ధాన్యం విక్రయించే వెసులుబాటును ఈ ఏడాది కల్పించారు. దీంతో అన్ని మిల్లుల యజమానులు బీజీలు చెల్లిస్తేనే ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరాటంకంగా కొనసాగుతుంది. అయితే కొందరు మిల్లర్లు బీజీలు చూపేందుకు ముందు, వెనుకా ఆలోచిస్తుండటంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు కొంతమేర ఆలస్యం జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఒకే సారి వరి కోతలు ప్రారంభమై, వాతావరణం అనుకూలించకుంటే తేమశాతం అధికంగా ఉన్నా ధాన్యం విక్రయించేందుకు రైతులు మొగ్గుచూపుతారు. డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులకు తేమశాతం అధికంగా ఉన్న ధాన్యం తరలిస్తారు. మిల్లు యజమానులు బీజీలు చూపకుంటే మిగతా 6లో..

ధాన్యం దిగుబడి అంచనా 11.65 లక్షల టన్నులు

ఈ ఏడాది జిల్లాలో 1.54 లక్షల హెక్టార్లలో ఇప్పటి వరకు వరి సాగు జరిగింది. దివిసీమ ప్రాంతంలోని నాగాయలంక, కోడూరు మండలాల్లో ఇంకా వరినాట్లు వేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 11.65 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారుల అంచనాగా ఉంది. ఇందులో 7.90 లక్షల టన్నుల వరకు ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అధికారులు చెబుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో 6.50 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఈ ఏడాది అదనంగా 1.40 లక్షల టన్నులను కొనుగోలు చేసేందుకు అనుమతులు ప్రభుత్వం నుంచి ముందస్తుగానే అధికారులు తెచ్చారు. ఈ ఏడాది ధాన్యం మద్దతు ధరను ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకం ధాన్యం రూ.2,369గా నిర్ణయించింది. జిల్లాలో 287 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశారు.



రిటైల్ వ్యాపారుల దందా!

ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినా మార్కెట్లో తగ్గని ధరలు

- సామాన్యులకు అందని పన్ను తగ్గింపు ప్రయోజనాలు
- మభ్య పెడుతూ పాత ధరలకే వస్తువుల అమ్మకాలు
- ఎంఆర్‌పీ కంటే అధికంగా కూడా విక్రయాలు
- పట్టించుకోని తూనికలు, కొలతలశాఖ అధికారులు
- తీవ్రంగా నష్టపోతున్న ప్రజలు

రిటైల్ మార్కెట్లో వ్యాపారుల వ్యవహారశైలి చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినా ఇక్కడ మాత్రం ధరలు తగ్గడంలేదు. జీఎస్టీ ప్రయోజనాలను వ్యాపారులు పొందుతూ, సామాన్యులకు మాత్రం దూరం చేస్తున్నారు. కొందరు పాత ధరలకే వస్తువుల విక్రయాలు చేస్తుంటే, మరికొందరు ఎంఆర్‌పీ కంటే అధికంగా అమ్మేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన తూనికలు, కొలతలశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ నగరంలో హోల్‌సేల్ మార్కెట్ ఒక్క గొల్లపూడి హోల్‌సేల్ కాంప్లెక్స్‌లోనే నడుస్తోంది. సూపర్ మార్కెట్స్ తప్పితే మిగతాదంతా రిటైల్ మార్కెట్. అతి పెద్ద రిటైల్ మార్కెట్‌లో కొనుగోలు చేసే ప్రజలు తీవ్రంగా మిగతా 6లో..

ఉపాధ్యాయులపై సైబర్ నేరగాళ్ల కన్ను

ఫోన్ చేసి బెదిరింపులు

- లక్షల రూపాయల డిమాండ్
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు



వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రూట్ మార్చారు. మొన్నటి వరకు రాజకీయ నాయకులు, వ్యాపారస్థులను టార్గెట్ చేసిన వీరి కన్ను ప్రస్తుతం ఉపాధ్యాయులపై పడింది. వేర్వేరు నెంబరుల నుంచి ఫోన్ చేస్తూ మీ కుమారులు అమెరికాలో, యూకేలో ఉన్నారంటూ, అక్కడ డ్రగ్స్ కేసులో పట్టుపడ్డారని, వారిని అరెస్టు చేయటానికి రంగం సిద్ధం చేశామంటూ బెదిరించి రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నారు. మరికొందరు ఉపాధ్యాయులకు వివాహేతర సంబంధాలు అంటగడుతూ, మీ వివరాలు మొత్తం మా దగ్గర ఉన్నాయి.. మీరు మాకు డబ్బులు పంపించకపోతే అన్ని వాట్సాప్ గ్రూపుల్లో మీ వివరాలు అప్‌లోడ్ చేస్తామంటూ బెదిరిస్తున్నారు.

- గత నెలలో వన్‌టౌన్‌లోని ఓ ప్రైవేటు స్కూల్లో పనిచేసే ఉపాధ్యాయురాలికి సైబర్ నేరగాళ్లు వేర్వేరు ఫోన్ నెంబర్ల నుంచి ఫోన్ చేశారు. నీ పేరు పలానా అని అడిగి, మేము మినిస్ట్రీ ఆఫ్ టెలీకమ్యూనికేషన్ నుంచి మాట్లాడుతున్నాం, నీ ఆధార్ నెంబరు పలానా నెంబరుకు ఎందుకు లింక్ అయ్యింది అని ప్రశ్నించారు. ఆమె తనకు తెలియదని చెప్పడంతో సైబర్ నేరగాళ్లు ఆమెను దబాయించి నీ వివరాలు మొత్తం మాకు తెలుసంటూ బెదిరించారు. ఆ ఉపాధ్యాయురాలి ఫోన్ నెంబర్‌కు అశ్లీల చిత్రాలను పంపించి బెదిరించటంతో ఆమె ఆందోళనకు గురైనట్లు తెలిసింది. ఇంకో వ్యక్తి మరోసారి ఫోన్ చేసి తాను ఎస్ఐనని చెబుతూ, మీ భార్యభర్తలపై కేసులు ఉన్నాయంటూ బ్యాంక్ వివరాలు అడిగాడు. ఆమె ఆ వివరాలు ఇచ్చిన తర్వాత ఆ అకౌంట్ చూసుకున్న సైబర్ నేరగాళ్లు నీ దగ్గర డబ్బులు లేవా అని గట్టిగా ప్రశ్నించటంతో ఇటీవలే ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్టు ఆమె తెలిపింది. ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను క్యాన్సిల్ చేసుకుని బ్యాంక్ అకౌంట్‌లో ఆ డబ్బులు వేసుకోవాలని చెప్పగా, భార్యాభర్తలు బ్యాంక్‌కు వెళ్లి, ఫిక్స్‌డ్ డిపాజిట్టును క్యాన్సిల్ చేసుకుని తమ బ్యాంక్ అకౌంట్‌లో వేసుకోవటానికి ప్రయత్నించారు. బ్యాంక్ మేనేజర్ వారి ఆందోళన గమనించి వివరాలు అడగ్గా, జరిగిన విషయాన్ని మేనేజర్‌కు వివరించారు. దీంతో ఆయన వారికి ధైర్యం చెప్పి సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు పంపించారు.

మోపిదేవి బీసీ ఆశ్రమ పాఠశాల



కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామంటూ గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు - నేడు పథకం మోపిదేవి మండలంలో అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పనులు చేయకుండా నిధులు డ్రా చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఇదే ఒరవడిని కొనసాగించారు. నిధులు దోచేసి..నిజాలను దాచేస్తున్నారని తల్లిదండ్రుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిధులు దోచేసి.. నిజాలు దాచేస్తున్నారు!

మోపిదేవి గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ.50.99 లక్షలు మంజూరు

- నాడు - నేడు 2వ దశ పనుల్లో అక్రమాలు
- పనులు చేయకుండానే నిధులు డ్రా చేసిన వైనం
- కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అక్రమాలు కొనసాగింపు!
- చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్

పనులు నిలిపివేయమని ఆదేశాలు ఇచ్చిన తర్వాత నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్





అసంపూర్తిగా మరుగుదొడ్లు

అవనిగడ్డ/మోపిదేవి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నాడు - నేడు ఫేజ్-2 భాగంగా మోపిదేవి మండలంలోని బీసీ మత్స్యకారుల ఆశ్రమ పాఠశాలకు రూ.50.99 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ పనులకు నాటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు 2022, సెప్టెంబరు 17వ తేదీన శంకుస్థాపన చేశారు. నాటి నుంచి పనులు నత్తనడకన జరగటంతోపాటు పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారనే ఆరోపణలు రావటంతో ఆ పనులు నిలుపుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పనులు జరిగిన తీరు వివాదాస్పదంగా ఉండటంతో ఎక్కడి పనులు అక్కడే నిలిపివేయాలని రాష్ట్ర విద్యాశాఖ జూన్‌లో ఆదేశాలు జారీ చేసింది. సదరు ఆదేశాలను జిల్లా కలెక్టర్, మండల విద్యాశాఖ కార్యాలయాలకు పంపించినప్పటికీ మోపిదేవి మండలంలో మాత్రం ఈ పనులను కొనసాగించిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' నాడే 'ఇదేం తీరు' అంటూ వెలుగులోకి తీసుకొచ్చింది. పాఠశాల భవన సామర్థ్యం గట్టిగా లేదని, అందువల్ల భవనంపై ఏ విధమైన నిర్మాణాలు చేపట్టరాదని ఇంజనీరింగ్ మిగతా 6లో..

అసంపూర్తిగా పనులు

భవన నిర్మాణ పనుల్లో ముఖ్యమైన టాయిలెట్ బ్లాక్, వంటగది పనులు సగం కూడా పూర్తి కాలేదు. మేజర్, మైనర్ రిపేర్లు ఎక్కడివి అక్కడే మిగిలిపోగా, కిటికీలు లేని తలుపులు విరిగి వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి పాఠశాలకు, వంటగదికి, టాయిలెట్లకు నీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. అయితే పనులు పూర్తి కాకుండానే దాదాపు రూ.19 లక్షల మేర నిధులను డ్రా చేసినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆ పనులను ఎక్కడివక్కడ నిలిపివేయాలని ఆదేశాలివ్వగా, సదరు బదిలీపై వెళ్లిపోయిన ప్రధానోపాధ్యాయుడి స్థానంలో వచ్చిన వారు నాడు జరిగిన తప్పులను కప్పిపుచ్చేందుకు తమ రాజకీయ పలుకుబడితో ప్రయత్నాలను ప్రారంభించారు. పనులను వెంటనే నిలిపివేయాలని విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు బేఖాతరు చేస్తూ పాఠశాల తరగతుల పైఅంతస్తులో వాటర్ ట్యాంక్ నిర్మించి ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులతో ఆ నిర్మాణాన్ని పూర్తి చేసినట్లుగా చూపించాలని చేస్తున్న ప్రయత్నాలను 'ఆంధ్రజ్యోతి' జూలైలోనే వెలుగులోకి తీసుకొచ్చింది.

చూడడానికి సైలెంట్‌గా కనిపిస్తాడు. ఆలోచనలు మాత్రం చాలా వైలెంట్‌గా ఉంటాయి. ప్రతి ఆలోచనలోను నేరపూరిత పొరలు ఉంటాయి. రాజకీయంగా అధికార, ప్రతిపక్ష భేదాలు ఉన్నప్పటికీ ఆయన విషయంలో మాత్రం అంతా స్వపక్షమే. ఆయన చేసే కార్యకలాపాలు ఏమిటో స్పష్టంగా తెలిసినా అన్ని పార్టీల నేతలు కాసులతో కళ్లు మూసుకున్నారు. ఇదీ నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు లీలలు. ఆయన గురించి ఆరా తీసే కొద్దీ కొత్తకొత్త విషయాలు బయటకు వస్తున్నాయి.

అమ్మో అద్దేపల్లి!

విద్యార్థి దశ నుంచి నేరపూరిత ఆలోచనలు

- అన్నదమ్ములిద్దరిదీ ఒకే తీరు
- తాతయ్య పేరుతో మద్యం వ్యాపారం
- ఇబ్రహీంపట్నంలో అన్ని పార్టీల నేతలతో సంబంధాలు
- ఏఎన్ఆర్ బార్‌కు స్థలం ఇప్పించిన టీడీపీ నేత
- ఆ ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు
- కేసుల నుంచి తప్పించుకునేందుకు రాజకీయ భాగస్వామ్యం
- జనార్దనరావుతో మద్యం వ్యాపారం చేసిన జోగి సోదరుడు



మంగళవారం రాత్రి ఇబ్రహీంపట్నంలోని అద్దేపల్లి జనార్దనరావు నివాసంలోకి వెళ్తున్న సిట్ అధికారులు

ఆంధ్రజ్యోతి-విజయవాడ: అద్దేపల్లి జనార్దనరావు మంచి విలాసపురుషుడు. ఆయనను చూసి తన సోదరుడు జగన్మోహనరావు అదే బాటలో పయనించాడు. ఇద్దరూ కలిసి ఒకే మార్గంలో వెళ్తున్నారు. జనార్దనరావు తండ్రి కిరాణా వ్యాపారం చేసి కూడగట్టిన ఆస్తులను విలాసాల కోసం అన్నదమ్ములు ఇద్దరూ హారతికర్పూరంలా కరిగించేశారు. ఇలా ఒక్కో ప్రాంతంలో ఉన్న ఆస్తులు, భూములను విక్రయించేయడంతో చిన్నాన్నలతో ఉమ్మడిగా ఉన్న ఆస్తులను అమ్మడానికి వారు అడ్డుకట్ట వేశారు. కొంత కాలంగా అన్నదమ్ములిద్దరూ తమ ఆస్తిని మిగతా 6లో..

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆశీస్సులు అందజేస్తున్న దుర్గగుడి వేద పండితులు, అర్చకులు



డిప్యూటీ సీఎంకు దుర్గమ్మ ఆశీస్సులు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు దుర్గగుడి వేదపండితులు మంగళవారం ఆశీస్సులు అందజేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ డాక్టర్ హరి జవహర్‌లాల్, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో దుర్గగుడి ఈవో శీనానాయక్, వేద పండితులు మంగళవారం సెక్రటేరియట్‌కు వెళ్లి పవన్‌కు అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం దుర్గమ్మ చిత్రపటం, లడ్డూ ప్రసాదం ఇచ్చారు. దసరా ఉత్సవాలు విజయవంతం కావటం గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు.

ఉపాధి పనుల్లో అవినీతి మకిలి 6
పెద ముత్తేవి ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు ● రూ.12.48లక్షల రికవరీకి ఆదేశాలు


జీఎస్టీ సంస్కరణలతో ఊపందుకోనున్న నిర్మాణ రంగం ● జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి 8

ఆరోగ్యం మన చేతుల్లోనే..! 8

అబ్బురపరిచే కళాకృతులు..

కార్లు, వాహనాలు ఇళ్లపైన ఉన్నాయేంటి అనుకుంటున్నారా.. ఇవి మన భవన నిర్మాణ కార్మికుల కళా నైపుణ్యానికి ప్రతీకలు. ఇంటిపైన నీటి ట్యాంకు సర్వ సాధారణం. అయితే టెక్నాలజీ శాసిస్తున్న ఈ రోజుల్లో భవన నిర్మాణ కార్మికులు తమ మేథస్సుతో వినూత్న రూపాలతో భవన నిర్మాణాలు చేపట్టడం విశేషం. విజయవాడ నగరంలో పలు చోట్ల ఇళ్లపైన నీటి ట్యాంకులను ఈ విధంగా మలిచారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)


ఆటోనగర్‌లో..


వన్‌టౌన్‌లో..


భవానీపురంలో..


పెనమలూరులో..


పటమట రైతుబజార్ రోడ్డులో..


యనమలకుదురులో..


జీఎస్టీ లబ్ధి ప్రతులను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, కొనకళ్ల నారాయణ, మండలి బుద్ధప్రసాద్ తదితరులు

జీఎస్టీ సంస్కరణలతో
ఊపందుకోనున్న నిర్మాణ రంగం

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి

అవనిగడ్డ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 సంస్కరణలతో నిర్మాణ రంగం ఊపందుకోనుందని, తగ్గిన శ్లాబుల ద్వారా 1000 చదరపు అడుగుల ఇంటి నిర్మాణంలో రూ.1.35 లక్షల మేర ఖర్చు తగ్గుతుందని జిల్లా ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మంగళవారం అవనిగడ్డ రెవెన్యూ సమావేశ మందిరంలో వాణిజ్య పన్నులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో మంత్రి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జేసీ నవీన్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణ రంగం పూర్తిగా కుదేలయిందన్నారు. నేడు జీఎస్టీ 2.0తో నిర్మాణ వ్యయం తగ్గి నిర్మాణాలు ఊపందుకోనున్నాయని తెలిపారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వపరంగా నిర్మాణాలు పెరగటంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగై నిర్మాణ రంగం ఊపందుకుందని తెలిపారు. జేసీ నవీన్ మాట్లాడుతూ, జీఎస్టీ శ్లాబులను సరళతరం చేయటంతో ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ ప్రచార కమిటీ జిల్లా కో-ఆర్డినేటర్, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కల్పన, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్‌ను నియోజకవర్గ భవన నిర్మాణ కార్మికులు కలిసి తమ సమస్యలను వివరించారు.


సంఘటన స్థలం వద్ద ఎమ్మెల్యే కొలికపూడి

రైతులపై రౌడీషీట్లా?

» వైసీపీ, టీడీపీ దాడి ఘటనపై ఎమ్మెల్యే ఆరా..

» టీడీపీ కార్యకర్తను పరామర్శించిన కొలికపూడి

సొబ్బాల (గంపలగూడెం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం చేసుకునే రైతులపై రౌడీషీట్లు తెరవడం ఏంటని, ఎస్‌ఐ ఎస్.శ్రీనివాసరావును ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రశ్నించారు. మంగళవారం సొబ్బాల గ్రామంలో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య కొట్లాటకు దారితీసిన ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. 2024 సంవత్సరం సార్వత్రిక ఎన్నికల సందర్భంగా, వైసీపీ-టీడీపీ కార్యకర్తల మధ్య జరిగిన కొట్లాటలో ఎన్నికల నియమావళిని అనుసరించి కేసులు నమోదు చేయాల్సి వచ్చిందని ఎస్‌ఐ వివరించారు. రౌడీషీట్ల వల్ల అమెరికాలోని తమ పిల్లల వద్దకు వెళ్లలేకపోతున్నామని, టీడీపీ నేతలు యడ్లపల్లి శ్రీనివాసరావు, కొమ్మినేని బాబు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. టీడీపీ కార్యకర్త ఇంటిపై వైసీపీ కార్యకర్తల దాడి ఘటనపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రభుత్వ స్థలంలో వైసీపీ తోరణాలను పార్టీ కార్యకర్తలు కట్టారని, వాటిని తొలగించాలని కోరితే, కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని సర్పంచ్ ఉన్నం కృష్ణారావు ఎమ్మెల్యేకు వివరించారు. టీడీపీ కార్యకర్తలపై కేసులు ఎత్తివేయాలని ఎమ్మెల్యేను సర్పంచ్ కోరారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా దళితులకు తన సొంతనిధులు రూ.10 లక్షలతో కమ్యూనిటీ షెడ్డు నిర్మిస్తానని ఎమ్మెల్యే గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అనంతరం వైసీపీ మూకదాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త కొంగల బాబురావును పరామర్శించారు. కార్యక్రమంలో వై.చంద్రం, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, కావూరి శ్రీనివాసరావు, గొల్లమందల రామకృష్ణ, చింతల లక్ష్మి, కోట వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



శతాబ్ది ఉత్సవ సభలో మాట్లాడుతున్న భరత్‌కుమార్‌జీ

హిందూత్వంతోనే విశ్వశాంతి

» సంఘ్ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ప్రతి పౌరుడు వసుధైక కుటుంబాన్ని నిర్మించాలన్నదే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) లక్ష్యమని సంఘ్ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కాకాని కల్యాణ మండపంలో సంఘ్ గన్నవరం ఖండ్ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవ సభ నిర్వహించారు. సభలో భరత్ కుమార్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ, మాతృ భూమిని కాపాడుతూ ధర్మాన్ని రక్షించే విధంగా ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. సంస్కారంతో కూడిన వ్యక్తి నిర్మాణం తద్వారా దేశ నిర్మాణం కోసం పనిచేస్తోందన్నారు. వందేళ్ళ కిందట ఐదుగురితో ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్ నేడు లక్షలాది శాఖల్లో కోట్లాది మంది స్వయం సేవకులు నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలు విశ్వశాంతికి ఆధారమన్నారు. నేటి యువత ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యాన్ని భావజాలన్ని అవగాహన చేసుకొని దేశాభిమానాన్నిపెంచుకోవాలని కోరారు. ముందుగా ఆర్‌ఎస్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, మన పూర్వీకులు అందించిన సంస్కృతి సంప్రదాయాలకు పునర్జీవం కల్పిస్తూ నేటి తరానికి ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కృష్ణామిల్క్ యూనియన్ తరఫున సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసే దిశగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నట్టు చలసాని పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ ప్రసంగించారు. వేదికపై కృష్ణా జిల్లా సహ సంఘ్ చాలక్ యలమంచిలి శాయోజీరావు, రైతు నాయకులు కురిటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్టాక్ ద రూమ్స్ సేవలు అభినందనీయం

» ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్


స్టాక్ ద రూమ్స్ ఫౌండర్‌ను సత్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

అవనిగడ్డ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సాధికారత, వారికి వచ్చే రుతు సమస్యలపై అవగాహన కలిగించేందుకు స్టాక్ ద రూమ్స్ ఆర్గనైజేషన్, తాట్ వేవ్ కంప్యూటర్స్ సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. మంగళవారం సాయంత్రం అవనిగడ్డలోని ఏ కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో 'స్టాక్ ద రూమ్స్ ఆర్గనైజేషన్' ఆధ్వర్యంలో 2500 మంది కళాశాల విద్యార్థినులకు బయో డిగ్రేడబుల్ నాప్‌కిన్స్ పంపిణీ, రుతు సమస్యలపై అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, మహిళా శక్తి ఎంతో గొప్పదని కానీ నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో రుతు సమస్యలపై అవగాహన లేక ఎంతోమంది మహిళలు కేన్సర్ కారణంగా ప్రమాదకర వ్యాధుల బారిన పడుతున్నట్టు తెలిపారు. స్టాక్ ద రూమ్స్ ఆర్గనైజర్ తూము హన్సిక రూ.10 లక్షలకుపైగా వెచ్చించి 2500 మందికి నాక్ కిన్లు అందించటం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, మోపిదేవి మండలం కె.కొత్తపాలెంలో జన్మించి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ చల్లపల్లిలో తాట్ వేవ్ కంప్యూటర్స్ సంస్థ ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న తూము రమేష్‌ను, స్టాక్‌ద రూమ్స్ ఆర్గనైజర్ హన్సికను ప్రత్యేకంగా అభినందించారు. హన్సిక మాట్లాడుతూ, 9వేల అమెరికన్ డాలర్లు సమీకరించి అమెరికాలో 200 రెస్ట్ రూమ్‌లుఏర్పాటు చేశామని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా 2500 కళాశాల విద్యార్థులకు ప్యాడ్లు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా తూము రమేష్, తూము హన్సికలను ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, బొండాడ రాఘవేంద్రరావులు సత్కరించారు. కార్యక్రమంలో సినీనటి గీతాభాస్కర్, గైనకాలజిస్ట్ నల్లపనేని కీర్తి, ఆలీవ్ దొరరాజు, ఎస్‌వీఎల్ కరస్పాండెంట్లు దుట్టా ఉమామహేశ్వరరావు, దుట్టా శివరామ ప్రసాద్, మండలి వెంకట్రామ్, అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమారాణి, వివేకానంద డిగ్రీ కళాశాల చైర్మన్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైల్ వ్యాపారుల దందా!

(5వ పేజీ తరువాయి)

నష్టపోతున్నారు. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తదితర రంగాల్లో జీఎస్టీ తగ్గింపులు విజయవంతంగా అమలు జరుగుతున్నాయి. కానీ నిత్యావసరాలకు సంబంధించి మాత్రం రిటైల్ మార్కెట్‌లో అమలు కావటం లేదు. రిటైల్ మార్కెట్‌లో జీఎస్టీ మినహాయింపులు ప్రజలకు అందటం లేదన్న ఫిర్యాదులు వస్తున్నా తూనికలు, కొలతల శాఖ అధికారులు పట్టించుకోవటం లేదు.

ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువగా విక్రయించే అధికారం ఉందా?

రిటైల్ వ్యాపారులైనా ఎంఆర్‌పీ కంటే అదనంగా విక్రయించటానికి లేదు. కానీ రిటైల్ వ్యాపారులు లాభం కోసం అధికంగా వసూలు చేస్తున్నారు. జీఎస్టీ ప్రయోజనాలనూ దిగమింగేస్తున్నారు. జీఎస్టీ తగ్గింపులు అమల్లోకి వచ్చి పక్షం రోజుల దాటినా ఇంకా పాత ఎంఆర్‌పీలతోనే విక్రయించటం చూస్తే పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతుంది.

జీఎస్టీ తగ్గింపులతో రిటైల్ వ్యాపారులకు ప్రయోజనం ఇలా

250 ఎంఎల్ కూల్‌డ్రింక్ గతంలో రూ.20 ఉండేది. జీఎస్టీ ప్రయోజనాల వల్ల రూ.2 తగ్గుతుంది. ఎంఆర్‌పీ రూ.18 అని ఉన్నా రిటైల్ వ్యాపారులు రూ. 20కు విక్రయిస్తున్నారు. గతంలో ఇదే బాటిల్ హోల్‌సేలర్ల నుంచి రూ.16కే రిటైలర్లకు వచ్చేది. ఎంఆర్‌పీ ధర రూ.20 ఉండేది. రిటైల్ వ్యాపారులు రూ. 4 ప్రయోజనం పొందేవారు. ఇప్పుడు ఎంఆర్‌పీ ధర రూ.18కి తగ్గింది. అయినప్పటికీ కూడా రూ.20కే విక్రయిస్తున్నారు. రిటైల్ వ్యాపారి రూ.6 లాభం పొందుతుండగా.. సామాన్య ప్రజలకు ప్రయోజనం దక్కటం లేదు. అలాగే లీటరు వాటర్ బాటిల్ ధర రూ.13.33కు తగ్గింది. కానీ ప్రస్తుతం రూ.20కు విక్రయిస్తున్నారు. ఒక్క లీటర్ వాటర్ బాటిల్‌పైనే రూ.6.67 అదనంగా వసూలు చేస్తున్నారు. రిటైల్ వ్యాపారికి రూ.181.39 లాభం వస్తోంది. గతంలో కేసు లీటర్ వాటర్ బాటిల్స్ రూ.240కు విక్రయించేవారు. వారికి అప్పట్లో రూ.100 లాభం వచ్చేది. జీఎస్టీ ప్రయోజనాలను దిగమింగటం వల్ల ప్రస్తుతం రూ.181.39 అదనపు ప్రయోజనాన్ని పొందుతున్నారు. ఈ ప్రయోజనాలేవీ కూడా సామాన్య ప్రజలకు అందటం లేదు. జీఎస్టీ తగ్గింపులకు సంబంధించి చూస్తే స్నాక్ ఫుడ్ వంటి వాటికి కూడా ఇంకా పాత ఎంఆర్‌పీలు వస్తున్నాయి. కొన్నింటికి తగ్గించి వచ్చినా రిటైల్ వ్యాపారులు పాత ధరలకే విక్రయిస్తున్నారు. సబ్బులు, పేస్టులు, కాస్మోటిక్స్ వంటి వాటి విషయంలో కూడా రిటైల్ వ్యాపారులు ఏమాత్రం తగ్గించని పరిస్థితులు నెలకొన్నాయి.

నిద్ర నటిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తుంటే.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో తూనికల కొలతల శాఖ అధికారులు నిద్రనటిస్తున్నారు. కనీస తనిఖీలు కూడా చేయటం లేదు. విజయవాడలో అతి పెద్ద మార్కెట్ ఉంది. జీఎస్టీ తగ్గింపులు అనే అంశం మాది కాదన్న రీతిన అధికారులు వ్యవహరిస్తున్నారు. జీఎస్టీ విజిలెన్స్ అధికారులకు ఎంత బాధ్యత ఉందో అంతకంటే ఎక్కువ బాధ్యత తూనికలు, కొలతల శాఖ అధికారుల మీద ఉంది. జీఎస్టీ తగ్గింపుల వల్ల నిర్దేశించిన ఎంఆర్‌పీ ధరలను కూడా కాదని అధికంగా విక్రయిస్తున్నపుడు చర్యలు తీసుకోవాల్సింది తూనికలు, కొలతల శాఖ అధికారులే. వ్యాపార సంస్థల నుంచి ఆయాచిత ప్రయోజనాలు పొందుతున్నారన్న తీవ్ర విమర్శలు ఇప్పటికే తూనికలు, కొలతలశాఖ అధికారులపై ఉన్నాయి. ఆరోపణలకు తగ్గట్టుగానే ఆ శాఖ అధికారుల తీరు ఉంటోంది.

నిర్లక్ష్యంగా..

(5వ పేజీ తరువాయి)

సంబంధిత మిల్లులకు ధాన్యం తరలించేందుకు అవకాశం ఉండదు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని పౌరసరఫరాలసంస్థ అధికారులు మిల్లర్లు త్వరితగతిన బీజీలు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. కానీ కొందరు మిల్లర్లు కావాలనే ఆలస్యం చేస్తున్నట్లు సమాచారం.

నేటి నుంచి మండల స్థాయిలో శిక్షణ

ఖరీఫ్ సీజన్ 2025-26 సంవత్సరంలో జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉయ్యూరు, గుడివాడ, మచిలీపట్నం రెవెన్యూ డివిజన్‌లలో ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు, మిల్లర్లు, తహసీల్దార్‌లు, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సాంకేతిక సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ధాన్యం సేకరణపై అవగాహన సదస్సుల్లో కలెక్టర్ బాలాజీ, జాయింట్ కలెక్టర్ నవీన్ పాల్గొన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు వివరించారు. డివిజన్ స్థాయిలో ధాన్యం కొనుగోలుపై శిక్షణా కార్యక్రమాలు పూర్తికాగా, మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ధాన్యం కొనుగోలు చేసే సమయంలో తేమశాతం కొలిచే యంత్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, మిల్లుల వద్ద ఒకేరకమైనవి అందుబాటులో ఉంచాలని, బియ్యంలో నాణ్యతను తెలుసుకునేందుకు మినీ మిల్లింగ్ యంత్రాలను కూడా అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

నిధులు దోచేసి.. నిజాలు దాచేస్తున్నారు!

(5వ పేజీ తరువాయి)

అధికారులు లిఖిత పూర్వకంగా లేఖలు అందించినప్పటికీ భవనంపై వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభించారు. నాడు-నేడు పనుల్లో భాగంగా 50.99 లక్షలతో టాయిలెట్ బ్లాక్, డ్రింకింగ్ వాటర్, మేజర్, మైనర్ పనులు, విద్యుద్దీకరణ, ఫర్నీచర్ ఏర్పాటు, పెయిటింగ్ పనులు చేపట్టాల్సి ఉండగా, జూలై నాటికి ఆ పనుల్లో 50 శాతం కూడా పూర్తి కానప్పటికీ దాదాపు రూ.19 లక్షలకుపైగా నిధులను గత ప్రభుత్వ హయాంలోనే డ్రా చేసుకోవటం విమర్శలకు తావిచ్చింది. ఆ సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన వారు పనులు పూర్తి కాకుండానే మిగిలిన రూ.19 లక్షల మొత్తాన్ని డ్రా చేయగా, జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరించటంతో ప్రజాప్రతినిధుల ఆశీస్సులతో నాడు జరిగిన నిధుల దుర్వినియోగం కప్పి పుచ్చేందుకు నేడు ప్రయత్నాలు సాగుతున్నాయి.

డ్రా చేసిన రూ.25 లక్షలకు వివరాల్లేవ్!

ఈ విషయమై సమాచార హక్కు చట్టం ద్వారా రెండు పర్యాయాలు అధికారులను వివరణ కోరగా, ఒకసారి రూ.25 లక్షల మేర నిధులు డ్రా చేసినట్లుగా సమాచారం ఇచ్చిన విద్యాశాఖాధికారులు, తాజాగా రూ.19.40 లక్షలు విడుదలయ్యాయని, అందులో రూ.18 లక్షలు మాత్రమే ఖర్చు అయినట్లుగా ఇటీవల సమాచారాన్ని అందించారు. ఇంకా చేయాల్సిన పనుల గురించి వివరాలు, డ్రా చేసిన నిధులకు సంబంధించిన తీర్మానాల బుక్, క్యాష్ బుక్ ఇంకా గత ప్రధానోపాధ్యాయులు అందించలేదని మండల విద్యాశాఖ తెలుపుతూ ఎమ్మార్సీలో నమోదైన నగదు ఉపసంహరణ వివరాలను మాత్రమే అందించారు. కానీ, గతంలో డ్రా చేసిన రూ. 25 లక్షలకు సంబంధించి ఎలాంటి వివరాలు అందజేయలేదు. నాడు - నేడు పథకం ఇప్పుడు మన బడి - మన భవిష్యత్‌గా మారింది కానీ రూ.50.99 లక్షలతో జరగాల్సిన పనులు మాత్రం అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తిగానే మిగిలిపోవటంపై మత్స్యకారులు మాత్రం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు నాడు నేడు పనుల్లో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై స్పందించి స్పష్టమైన సమాచారం ఇవ్వటంతోపాటు వెంటనే ఆ పనులు పూర్తి చేయాలని నియోజకవర్గానికి చెందిన మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

అమ్మో అద్దేపల్లి!

(5వ పేజీ తరువాయి)

పంచాలని చిన్నాన్నలపై ఒత్తిడి చేస్తున్నారు. జనార్దనరావు, జగన్మోహనరావు ప్రవర్తన గురించి తెలిసిన చిన్నాన్నలు ఆస్తిని పంచడానికి అంగీకరించలేదు. ఇంజనీరింగ్ విద్యాభ్యాసం నుంచే జనార్దనరావు ఆలోచనలు నేరపూరితంగా ఉండేవని చిన్ననాటి స్నేహితులు చెబుతున్నారు. సమాజంలో ప్రముఖులుగా ఎదిగిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ఆ స్థాయికి వెళ్లాలని భావించేవాడు. నిజాయితీగా వ్యాపారాలు చేసి ఆ స్థాయికి వెళ్లలేమని జనార్దనరావు గమనించాడు. అడ్డదారులు తొక్కితేనే ఉన్నత స్థితికి చేరుకుంటామనుకున్నాడు. ఇంజనీరింగ్ నుంచి జనార్దనరావుకు విలాసవంతంగా గడపం అలవాటుగా మారింది. విదేశాలకు వెళ్లి ఎంజాయ్ చేయడం ఆయనకు చాలా ఇష్టం. జనార్దనరావు తరచూ ఆఫ్రికా దేశాలకు వెళ్తుండేవాడని స్థానికులు చెబుతున్నారు. అక్కడ తనకు నచ్చినట్టుగా ఎంజాయ్ చేసేవాడు.

తాతయ్య జ్ఞాపకార్థం

అద్దేపల్లి జనార్దనరావు తన తాతయ్య పేరు మీద మద్యం వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నాడు. తాతయ్య అద్దేపల్లి నాగేశ్వరరావు (ఏఎన్‌ఆర్) పేరుతో బార్‌ను ఏర్పాటు చేశాడు. మద్యం వ్యాపారంలోకి దిగినప్పటి నుంచి ఈ పేరుతోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. తొలుత జాతీయ రహదారి పక్కన ఈ బార్‌ను నెలకొల్పాడు. ఈ బార్‌ను జాతీయ రహదారికి పక్కన ఏర్పాటు చేయడానికి టీడీపీకి చెందిన ఓ నాయకుడు సహకరించినట్టు స్థానికులు చెబుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో బార్‌ను ఇక్కడి నుంచి తొలగించినా స్థలాన్ని మాత్రం జనార్దనరావు ఉపయోగించుకుంటున్నాడు. స్థలానికి సమీపంలో టీడీపీ నేత ఇల్లు ఉందని సమాచారం. ఈ స్థలంలోనే జనార్దనరావు నకిలీ మద్యం తయారీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. జనార్దనరావు చేసే నకిలీ వ్యాపారానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చేసుకోవడానికి రాజకీయ సంబంధాలను కొనసాగించాడు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలతో అంటకాగేవాడు. ఇందులో భాగంగానే 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇబ్రహీంపట్నంలోని ఆ పార్టీ నేతలకు దగ్గరగా ఉండేవాడు. 2019 నుంచి 2023 వరకు వైసీపీ నేతలకు దగ్గరగా ఉన్నాడు. అద్దేపల్లి జనార్దనరావు బార్ ముసుగులో ఏ వ్యాపారం చేస్తున్నాడన్న విషయం ఇబ్రహీంపట్నంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలకు బాగా తెలుసు. ఏ నాయకుడు ఆరోపణ, విమర్శ చేయడానికి వీలు లేకుండా ఆ నేతలకు చేయాల్సిన ఏర్పాట్లు చేసేవాడు. ఏఎన్‌ఆర్ బార్‌కు స్థలం ఇప్పించిన నేతతో జనార్దనరావుకు ఇప్పటికీ సత్సంబంధాలు, ఆర్థిక సంబంధాలు ఉన్నాయని స్థానికులు బహిరంగంగా చెబుతున్నారు. వైసీపీ హయాంలో బార్‌ను దక్కించుకున్న జనార్దనరావు తెలంగాణలో వ్యాపారం చేయడానికి అన్ని రాజకీయ పార్టీల నేతలను ఇందులో భాగస్వాములను చేశాడు. ఇందులో భాగంగానే మాజీ మంత్రి జోగి రమేశ్ సోదరుడి బార్‌లో చాలాకాలం భాగస్వామిగా ఉన్నాడు.

జనార్దనరావు జోగీ మెట్లు ఎక్కాడా?

అద్దేపల్లి జనార్దనరావు.. మాజీ మంత్రి జోగి రమేశ్‌కు సంబంధించిన మరిన్ని అంశాలు నెమ్మదిగా బయటకు వస్తున్నాయి. జోగి రమేశ్ ఆధ్వర్యంలోనే తాము నకిలీ మద్యం తయారు చేసినట్టు జనార్దనరావు వీడియోలు విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా వారిద్దరికీ మధ్య జరిగిన వాట్సాప్ చాటింగ్ బయటకు వచ్చింది. కాల్ మీ అని జోగి రమేశ్ జనార్దనరావుకు సందేశం పంపాడు. దానికి ఆయన ఓకే.. అని తిరుగు సమాధానం ఇచ్చాడు. తర్వాత కమ్ టు మై హోం అని జోగి నుంచి సందేశం వచ్చింది. దీనిప్రకారం జనార్దనరావు ఆయన ఇంటికి వెళ్లినట్టు తెలుస్తోంది. ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చాటింగ్ జరిగిన తేదీని బట్టి జోగి రమేశ్ ఇంటి చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు సేకరిస్తున్నారు.

జనార్దనరావు ఇంట్లో సిట్ అధికారుల సోదాలు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు కల్తీ మద్యం కేసులో ఏ 1 ముద్దాయి అయిన జనార్దనరావుకు చెందిన ఇబ్రహీంపట్నంలోని ఇంట్లో మంగళవారం రాత్రి సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆయన ఇంట్లో ఉన్న పలు కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ సభ్యులను విచారించారు. ఇంట్లో లభించిన ల్యాబ్ టాప్ పాస్ వార్డు తదితర వివరాలు గురించి పోలీసులు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్తుల వివరాలపై విచారణ చేశారు. మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు కొనసాగాయి.


కేరళ డీజీపీ ఆజాద్ చంద్రశేఖర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ

దుర్గమ్మ సేవలో కేరళ డీజీపీ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్ర డీజీపీ రావాడ ఆజాద్ చంద్రశేఖర్ మంగళవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఈవో శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ఈవో, చైర్మన్ అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం ఇచ్చారు. అనంతరం డీజీపీ ఆజాద్ మీడియాతో మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.


రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుభాష్ తదితరులు

కలెక్టరేట్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సుభాష్ చంద్ర

మచిలీపట్నంటౌన్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కలెక్టరేట్ యూనిట్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా డిప్యూటీ తహసీల్దార్ వి.సుభాష్ చంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన ఎన్నికల్లో అసోసియేట్ అధ్యక్షుడిగా టి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మిర్జా రిజ్వానుల్లా బేగ్, ఎం.మణికుమార్, షేక్ వహీదారహమాన్, ప్రధాన కార్యదర్శిగా అక్బర్‌ఖాన్, జాయింట్ సెక్రటరీలుగా ఆర్.కోటేశ్వరరావు, డి.దివ్యశ్రీ, డీవీఎస్. మల్లేశ్వరరావు, కోశాధికారిగా పి.ఎస్.వి.రాజేశ్వర ఆచార్యులు, కార్యవర్గ సభ్యులుగా ఎస్.రాము, ఎండీ షకీరుల్లా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వై.రంగారావు వ్యవహరించారు.

నేడు గాంధీజీ హైస్కూల్‌కు
ఎన్నారై రాజ్ వట్టికూటి రాక



వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ బీఆర్పీ రోడ్డులోని గాంధీజీ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 1964-67 మధ్య చదివిన పూర్వ విద్యార్థి, ప్రముఖ ఎన్నారై రాజ్ వట్టికూటి బుధవారం గాంధీజీ హైస్కూల్‌కు రానున్నారు. అమరావతిలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనటానికి ఆయన విజయవాడ విచ్చేశారు. అందులో భాగంగా బుధవారం ఓ హోటల్‌లో జరగనున్న సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 9.45 గంటలకు వన్‌టౌన్ గాంధీజీ హైస్కూల్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా సుమారు రూ.30లక్షలకు పైగా విలువ చేసే కంప్యూటర్లు, ఇతర సామగ్రిని అందచేయనున్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటనున్నారు. ఈయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు.


మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

ఉపాధి పనుల్లో
అవినీతి మకిలీ

» పెదముత్తేవి ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

» 12.48లక్షల రికవరీకి ఆదేశాలు

కూచిపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో పెద్ద మొత్తంలో అవినీతి జరిగినట్టు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఇందుకు సంబంధించి సంబంధిత వ్యక్తుల నుంచి రూ.12.48,000లు రికవరీకి ఆదేశాలు జారీ చేయగా, రూ.1.25 లక్షలు అపరాధ రుసుముగానూ, రూ.12 లక్షల పనులకు సంబంధించి విచారణ చేపట్టాల్సిందిగా డ్వామా పీడీ శివప్రసాద్‌యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. మొవ్వ మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో 2024-25 సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారు. పెదముత్తేవి ఫీల్డ్ అసిస్టెంట్ వి.సీతారామదాసు చనిపోయిన వ్యక్తులకు పనులకు హాజరైనట్టు మస్తర్లు వేయటంతో అతడ్ని సస్పెండ్ చేస్తూ అవకతవకలపై అతడి నుంచి రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్ నాగలక్ష్మికి షోకాజ్ నోటీసులు జారీ చేయవలసిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో శాట్ అడిషనల్ డైరెక్టర్ రామారావు, అంబుడ్స్‌మెన్ పరిశీలకులు కె.శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారి సురేష్, ఇంచార్జ్ ఏపీడీ లక్ష్మీరెడ్డి, ఎస్‌ఆర్‌పి సుబ్బారావు, ఎండీవోలు సుహాసిని, విమాదేవి, ఏపీవో దేవానందరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలి



కంకిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం రూ. 20 వేలు వారి ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు అన్నారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలంటూ తహసీల్దార్ భవన్నారాయణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు జె. రవి, వి. మరియదాసు, టి. నరేష్, సీహెచ్ శ్రీహరి, బి. దీపిక, బి.ప్రియాంక, ఎం. ప్రభాకర్, ఎం. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గృహ నిర్మాణ లేఅవుట్లలో

మెరుగైన సౌకర్యాలు కల్పించండి

కలెక్టర్ డీకే బాలాజీ

పెనమలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ గృహ నిర్మాణ సముదాయాల్లో లబ్ధిదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని వణుకూరు, పెనమలూరు గ్రామాల్లోని గృహనిర్మాణ లేఅవుట్లను కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. వణుకూరులోని గృహ నిర్మాణ లేఅవుట్లను నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. గృహ నిర్మాణ సంస్థ డీఈ శివ ప్రసాదరావు కలెక్టరుకు గృహ నిర్మాణల స్థితిగతులను వివరించారు. కాలనీలో రహదారులు, మురుగు కాల్వలు లేవని, వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు కలెక్టర్ ముందు వాపోయారు. కలెక్టర్ వెంటనే స్పందించి ఇరిగేషన్ మౌలిక సౌకర్యాల కల్పనకు తగు చర్యలు తీసుకోవాలని ఈఈ రవికిరణ్‌ను ఆదేశించారు. స్థానికురాలు కుంభ దుర్గ మాట్లాడుతూ, గతంలో తనకు 21సెంట్ల సాగు భూమి ఉండేదని, తన భూమిని తనకు తెలియ కుండానే గృహాల కాలనీకి తీసుకున్నారని, ఈ విషయమై గత మూడేళ్లుగా అధికారులను అడుగుతున్నా తనను పట్టించుకోవడం లేదని వాపోయింది. సమస్యను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ గోపాలకృష్ణనను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పెనమలూరు లేఅవుట్‌ను కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. తాము గతంలో అద్దె ఇళ్లలో ఉండేవారమని, అద్దెలు కట్టుకోలేక ఇక్కడికి వచ్చి ఇళ్ల నిర్మాణాలు చేపడితే వర్షాకాలంలో పంట కాల్వల నుంచి నీరు వచ్చి నిలబడిపోతోందని తెలిపారు. విష పురుగులతో అవస్థలు పడుతున్నామని, అపరిశుభ్రతతో రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది విన్న కలెక్టర్ తాను వచ్చింది ప్రజల సమస్యలు వినడానికేనని, కాలనీలకు కావలసిన సౌకర్యాలను కల్పించేందుకు తగు చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట హౌసింగ్ అధికారి పోతురాజు, ఎంపీడీవో ప్రణవి, ఏఈ జిలాని, సూర్యనారాయణ, వీరాంజనేయులు, అనురాధ, రాజా, నరేష్‌కుమార్, సుధీర్ తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ గృహ నిర్మాణ కాలనీలో స్థానికుల సమస్యలు వింటున్న కలెక్టర్ బాలాజీ

సామాజిక భవనం నిర్మించాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు కలువపాముల ఎస్సీ కాలనీ వాసుల వినతి

ఉయ్యూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కలవపాముల ఎస్సీకాలనీలో సామాజిక భవన నిర్మించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు కాలనీ వాసులు వినతి ప్రతం సమర్పించారు. గ్రామపార్టీ అధ్యక్షుడు ఘంటా పూర్ణచంద్రరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కలపాల మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సీకాలనీ వాసులు మంగళవారం పోరంకి కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి కాలనీలో సామాజిక భవనం ఆవశకతను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, సామాజిక భవన నిర్మాణానికి ఎంపీ బాలశౌరి సహకారంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్, పార్టీ నాయకులు రావెల వరుణకుమార్, రంపా శ్రీను, పామర్తి శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్టు

ఉయ్యూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాటూరు రోడ్డులో అమృత హోటల్‌లో పనిచేస్తున్న మహిళతో అసభ్యకరంగా మాట్లాడి ఆమెపై దాడి చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఉయ్యూరు పట్టణ పోలీసులు తెలిపారు. పమిడిముక్కల మండలం రెడ్డిపాలెంకు చెందిన దేవరాజు, తాడంకికి చెందిన లక్ష్మణ్ సోమవారం రాత్రి హోటల్‌లో పుల్కా తినే నెపంతో వచ్చి కౌంటర్‌లో ఉన్న తనతో అసభ్యకరంగా మాట్లాడి దాడిచేశారని నంబూరి సౌజన్య చేసిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

పేరు మార్పు ప్రకటన

విజయవాడ, కానూరు, అశోక్ నగర్, H.No. 10-143, చౌదరిపేట గ్రామ కాపురస్తుడు చిగులూరి శ్రీనివాస్‌చౌదరి S/o. చిగులూరి సుబ్బారావు పేరుగల 10వ తరగతి మార్కుల లిస్టులో చిగులూరి శ్రీనివాస్‌చౌదరికి బదులుగా చిగులూరి శ్రీనివాసచౌదరిగా ప్రచురితమైనది. కావున **చిగులూరి శ్రీనివాస్‌చౌదరి** గా మార్చుకొనడమైనది. కావున తెలియజేయడమైనది.

మహారాజశ్రీ విజయవాడ 2వ అదనపు జిల్లా కోర్టు నందు
ఇ.పి. నెం.35/2021 ఇన్ O.S నెం.77/2016

బిట్వీన్:
తుమ్మల లక్ష్మేశ్వరరావు, S/o. వెంకట కృష్ణారావు, అమ్మవారితోట, నూజివీడు, కృష్ణా జిల్లా. ... డి. హెచ్.ఆర్.

మరియు

బొర్రా కృష్ణ, S/o.రంగారావు, డోర్ నెం.2-75, తూముల సెంటర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురు, పోరంకి గ్రామం, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా. ... జె.డి.ఆర్.

ప్రకటన

పై నెంబరు ఇ.ఇపి.లో జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా జప్తు కాబడి ది.03-11-2025వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి పైకోర్టులో బహిరంగ వేలం జరుపబడును. కావున ఆసక్తిగల పాటదారులు పైకోర్టువారి ఎదుట హాజరై వేలంపాటలో పాల్గొని పాడుకొనవచ్చునని యావన్మందికీ ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూల్ : ఐటమ్ నెం.1: 75.84 చ.గ.ల విస్తీర్ణం కలిగిన ఇంటి స్థలంనందు నిర్మించబడిన రెండంతస్తుల బిల్డింగ్ డోర్ నెం. 2-75, ఆర్.ఎస్.నెం.379, పోరంకి గ్రామం, పెనమలూరు మండలం, కంకిపాడు సబ్‌రిజిస్ట్రీ, కృష్ణాజిల్లా ఈక్రింది **హద్దులలో:-**
తూర్పు: రెండవ ఐటమ్ జాయింట్ దారి, **దక్షిణం:** బొర్రా రంగారావుగారి ఆస్తి, **పడమర:** పంద్రాజు సామ్రాజ్యంగారి ఆస్తి, **ఉత్తరం:** బొర్రా శ్రీనివాసరావుగారి ఆస్తి
ఐటమ్ నెం.2: 13.61 చ.గ.ల విస్తీర్ణంగల జాయింట్ దారి 40.83 చ.గ.లలో ఐటమ్ నెం.1కు చేరేదారిలో ఆర్.ఎస్.నెం. 379, పోరంకి గ్రామం, పెనమలూరు మండలం, కంకిపాడు సబ్‌రిజిస్ట్రీ, కృష్ణాజిల్లా ఈక్రింది **హద్దులలో:-**
తూర్పు: చనుమోలు మోహనరావుగారి ఆస్తి, **దక్షిణం:** పంచాయతి రోడ్, **పడమర:** ఐటమ్ నెం.1, బొర్రా శ్రీనివాసరావు మరియు బొర్రా రంగారావు గార్ల ఆస్తి, **ఉత్తరం:** చెరువు (ట్యాంక్)

డి.హెచ్.ఆర్.విలువ : రూ.10,00,000/-లు
అమీనా విలువ : 40,00,000/- లు
// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

విజయవాడ,
తేది:14-10-2025

యలమంచిలి రామకృష్ణ,
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది



విరాళం అందజేస్తున్న సుబ్బాచారి

మానవత విద్యానిధికి విరాళం

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మానవత నిర్వహిస్తున్న ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యానిధికి మానవ జంక్షన్ శాఖ డైరక్టర్ కూరెళ్ల సుబ్బాచారి రూ.25వేలు విరాళం అందజేశారు. మంగళవారం స్థానిక మానవత కార్యాలయంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు చేతులు మీదుగా సుబ్బాచారి విరాళం అందించారు. కార్యక్రమంలో మానవత నిర్వాహకులు గణేష్, సత్యనారాయణ, ఘంటా ఇందిరాదేవి, చలం, సూర్యనారాయణ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, వైద్యనిపుణులు

సిద్ధార్థ వర్సిటీలో

సీపీఆర్‌పై వర్క్‌షాప్

కానూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): సీపీఆర్ వీక్ కార్యక్రమంలో భాగంగా కానూరు లోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో మంగళవారం డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య విజ్ఞాన సంస్థ, పరిశోధన ఫౌండేషన్ సహకారంతో వర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో గుండె ఆగిన సందర్భంలో తక్షణ ప్రాణరక్షణ చర్యగా సీపీఆర్ పద్ధతుల ప్రాముఖ్యతను వైద్యనిపుణులు వివరిస్తూ విద్యార్థులకు ప్రదర్శనలు ఇచ్చారు. ప్రాణాలను కాపాడుకోవడంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. వర్సిటీ అధికారులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.



ఘనంగా టీడీపీ ఎస్సీసెల్ నేత

పందిపాటి జన్మదిన వేడుకలు

కంకిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మండలంలోని ఈడుపుగల్లు, కంకిపాడు, పునాదిపాడు గ్రామాల్లో ఆయా పార్టీ నాయకులు సుధాకర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కంకిపాడు క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ మోనటిరింగ్ కమిటీ సభ్యులు కొండా నాగేశ్వరరావు, సీహెచ్‌సీ డైరెక్టర్ గరికిపాటి రవికిషోర్, ఎస్సీ సెల్ నాయకులు డీఎస్ఆర్, తెలుగు యువత నాయకులు బొర్రా వెంకట్, కోడెల సురేష్, నరేష్ పాల్గొన్నారు.



బహుమతిని అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్‌చంద్ దంపతులు

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు ఎడ్యుకేషనల్ వరల్డ్ ర్యాంకు

ప్రసాదంపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎడ్యుకేషనల్ వరల్డ్ నిర్వహించిన కో ఎడ్యు డే కమ్ బోర్డింగ్ స్కూల్స్ విభాగంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజయవాడకు ఏపీలో ప్రథమ, ఆల్ ఇండియాలో 19 ర్యాంకు వచ్చిందని పాఠశాల ప్రిన్సిపాల్ మంగళవారం తెలిపారు. ఢిల్లీ ఎడ్యుకేషనల్ వరల్డ్ నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్‌చంద్, సతీమణి శ్వేత బిందు అందుకు న్నారని వెల్లడించారు. ఏపీలో 2014 నుంచి మొదటి ర్యాంకును సాధించిన ఏకైక సంస్థ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అని డైరెక్టర్ పరిమి పవన్‌చంద్ అన్నారు. ఇంతటి గొప్ప ర్యాంకులు రావడానికి కారణమైన డైరెక్టర్ కడియాల ప్రవీణ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను, సిబ్బందిని పాఠశాల ప్రో వైస్ చైర్మన్ పరిమి నరేంద్రబాబు అభినందించారు.

సాగర్ జలాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్ఎస్ ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ వరద జలాలను వృథా కానీయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్ ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. రంగన్నగూడెం వద్ద అంపాపురం సబ్ మైనర్ ద్వారా విడుదలవుతున్న సాగర్ జలాలను అధికారులు, రైతులతో కలిసి మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృషితో చివరి గ్రామాలకు కూడా సాగర్ జలాలు అందేలా ఉన్నతాధికారులు వీలు కల్పించారన్నారు. ఆయుకట్టులోని బండారుగూడెం, కోడూరుపాడు, వీరవల్లి, రేమల్లె, వేలేరు తదితర గ్రామాలకు సాగర్ జలాలు అందాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎల్సీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.సీతారావమ్మ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసన్నకుమార్, యార్లగడ్డ నవీన్‌బాబు, రంగన్నగూడెం సాగునీటి సంఘ ఉపాధ్యక్షుడు బత్తుల సాంబశివరావు, ఉపసర్పంచ్ బెజవాడ కృష్ణారావు, ఆయుకట్టు రైతులు కొలుసు శివయ్య, అక్కినేని కృష్ణాజీ, కసుకుర్తి సుభాస్‌చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

డీసీఈబీ జిల్లా కార్యదర్శి విజయ్‌కు సత్కారం



గన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) కృష్ణాజిల్లా కార్యదర్శిగా నియమితులైన బాపులపాడు ఎంఈవో-2 కొమ్మా విజయ్‌ని ఎంఈవో కార్యాలయంలో మంగళవారం సత్కారించారు. ఆయనకు గుడివాడ ఉప విద్యాశాఖాధికారి కొండా రవికుమార్, పలువురు ఎంఈవోలు దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. గన్నవరం. ఉంగుటూరు, బాపులపాడు ఎంఈవోలు ఎం. కమల, సాంబశివరావు, రాంబాల్‌సింగ్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్లతో డిజిటల్ విప్లవం

ఉయ్యూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్లు డిజిటల్ విప్లవంలో అంతర్భాగంగా ఉండి రోజువారీ జీవితాన్ని మరింత నిర్వహించగలిగేలా ఉన్నాయని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలోలో మంగళవారం నిర్వహించిన అర్చుతి-2కె25 కంప్యూటర్ ఫెస్ట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గీతం యూనివర్సిటి రిటైర్డ్ ప్రొ. చాన్సలర్ ఎస్. శివప్రసాద్ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు ప్రపంచంలో అనేక సమస్యలకు పరిష్కారాలు అందిస్తూ, ఆర్థికవృద్ధిని వేగవంతం చేస్తుందన్నారు. కృత్రిమ మేధస్సు ఆధునికయుగంలో అద్భుతమైన మార్పులు తీసుకురాగల శక్తి వంతమైన సాంకేతికత అన్నారు. 15 కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు ఫెస్ట్‌లో పాల్గొన్నారు. ఫెస్ట్‌లో విజేతలకు కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు బహుమతులు అందజేశారు. సుధీర్‌టింబర్ డిపో అధినేత నూకల సాంబశివరావు, కంప్యూటర్ శాఖాధిపతి సీహెచ్ అనిల్‌కుమార్, అకడమిక్ ఆఫీసర్ ఎల్. కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ శివనాథ్, సత్యనారాయణ, వినయ్‌కుమార్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యత



ప్లాస్టిక్ నియంత్రణపై ఉషారామా విద్యార్థుల ర్యాలీ

ఉంగుటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు అన్నారు. తేలప్రోలు ఉషా రామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ప్లాస్టిక్ నియంత్రణపై విద్యార్థులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకానికి స్వస్తిపలకాలని నినదిస్తూ ప్లకార్డులు, బ్యానర్లతో స్థానిక కళాశాల నుంచి ప్రారంభించిన ఈ ర్యాలీ జాతీయ రహదారి మీదుగా పొట్టిపాడు వరకు కొనసాగింది. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వినియోగంవల్ల కలిగే అనర్థాలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి కలిగే ముప్పును తెలియజేసే కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన స్వచ్ఛరథం (మొబైల్ సూపర్ బజార్) బాపులపాడులో సత్ఫలితాలను ఇస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి బీఎస్. పూర్ణేశ్వరి మంగళవారం తెలిపారు. ప్రజల నుంచి వ్యర్థ వస్తువులను సేకరించి వాటి విలువకు సరిపడ నిత్యా వసర సరుకులను అందించే స్వచ్ఛ రథం పట్ల ప్రజల్లో ఆసక్తి పెరిగిందన్నారు. గ్రామంలో నాలుగు రోజులు క్రితం స్వచ్ఛరథం ప్రవేశపెట్టిగా రూ.10వేలు వ్యాపారం నిర్వహించినట్లు తెలిపారు. పజలు స్వచ్ఛ రథం సేవలను వినియోగించుకొని గ్రామాన్ని శుభ్రంగా ఉంచడానికి సహకరించాలని కోరారు.

సాంబశివరావు సేవలు అభినందనీయం

ఉయ్యూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సాంబశివరావు సేవలు అభినందనీయమని ఆర్యవైశ్య ప్రముఖులు కొనియాడారు. బర్లింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ నుంచి వ్యాపార, సామాజిక సేవా కార్యక్రమాలకు సంబంధించి నూకల సాంబశివరావు డాక్టరేట్ తీసుకోవడం వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘానికి గర్వకారణమని పలువురు వాసవీక్లబ్ సభ్యులు కొనియాడారు. బర్లింగ్టన్ స్టేట్ యూని వర్సిటీ నుంచి డాక్టరేట్ తీసుకున్న సాంబశివరావుకు వాసవీక్లబ్ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. వాసవీక్లబ్ పూర్వపు అధ్యక్షుడు బాబ్జి, ప్రస్తుత అధ్యక్షుడు హేమంత్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వీరాంజనేయులు, నాగరాజు, నేరెళ్ల తేజ, వూర నాగిన్, కిషోర్, దోరెడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతితోనే మానవ మనుగడ

● కానుమోలులో శ్రీలంక బౌద్ధ బిక్షువు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు, కరుణ, అహింస వంటి సిద్ధాంతాలకు బౌద్ధమతం మార్గనిర్దేశం చేస్తుందని శ్రీలంక బౌద్ధ బిక్షువు బోధి హీన్ అన్నారు. కానుమోలులో రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ బౌద్ధమతం స్వీకరించిన రోజుకు గుర్తుగా మంగళవారం దేవకాంచం మొక్కను నాటారు. ప్రకృతిని రక్షించడమంటే మనల్ని మనం రక్షించుకోవడమేనని బౌద్ధం బోధిస్తుందన్నారు. రాణా వెల్ఫేర్ సొసైటీ సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్, పీఏసీఎస్ సీఈవో సుమన్, అంబర్ల కృష్ణప్రసాద్, దన్నే మల్లిఖార్జునరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడిగడప మునిసిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలో ప్రస్తుతం అమల్లో ఉన్న మాస్టర్ ప్లాన్‌ను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మార్పు చేర్పులు చేసి అమలు పరచాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధికారులకు సూచించారు. మంగళవారం పోరంకి ద్వారకా రెసిడెన్సీలో సీఆర్డీయే ఆధ్వర్యంలో విజన్ 2047 డ్రాఫ్టు మాస్టర్ ప్లాన్ తయారు చేసే విషయంపై చర్చించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డ్రాఫ్టు మాస్టర్ ప్లాన్ తయారు చేయడంలో అందరి అభిప్రాయాలకు విలువివ్వాలని అధికారులను కోరారు. మాస్టర్‌ప్లాన్ తయారు చేసే సమయంలో మునిసిపాలిటీలో, చుట్టుప్రక్కల ఉన్న చెరువులను అభివృద్ధి చేయాలని, భవిష్యత్తు అవసరాలు దృష్ట్యా అసంపూర్తిగా ఉన్న రోడ్లను విస్తరించాలని కోరారు. ప్రస్తుతం 40అడుగుల రోడ్లను 60అడుగులు గాను, 60అడుగుల రోడ్లను 80అడుగుల రోడ్లకు విస్తరించేందుకు తగు ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచాలని కోరారు. మాస్టర్ ప్లాన్ ముసాయిదా తయారు చేసి అమలు పరచే ముందు ప్రజలకు పారదర్శకంగా మరో సమావేశంలో ప్రదర్శించి, వివరించి అధికారులు అమలు చేయాలని కోరారు. సమావేశంలో స్టేక్ హోల్డర్ల నుంచి అభిప్రాయాలు చేకరించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, తాతపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గూగుల్ రాకతో ఏపీలో గేమ్ ఛేంజర్

విశాఖపట్నానికి గూగుల్ సంస్థ రావడం రాష్ట్రంలో గేమ్ ఛేంజర్ లాంటిదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. మంగళవారం ఢిల్లీ నుంచి ఉండవల్లి నివాసానికి చేరుకొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్‌లను ఎమ్మెల్యే కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గూగుల్ రాకతో రాష్ట్రం ఒక ఐటీ హబ్‌గా మారబోతోందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, శొంఠి శివరాంప్రసాద్, తుమ్మల రాంకుమార్, దండమూడి చౌదరి తదితరులు ఉన్నారు.

జోగి రమేశ్ మళ్లీ శాసనసభలో అడుగుపెట్టలేడు: బోడె

పెనమలూరు : నకిలీ మద్యం కుట్రదారు జోగి రమేశ్ జన్మలో మళ్లీ శాసనసభలో అడుగుపెట్టలేడని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ బీసీ కార్యకర్తలు, నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా జోగి రమేశ్ చేసిన వికృత చేష్టలపైన, వైసీపీ నేతల తీరుపైన విరుచుకుపడ్డారు. మునుపటి ఎన్నికల ముందు జగన్‌రెడ్డి బాబాయి హత్య అంటూ.. కోడికత్తి అంటూ డ్రామాలాడి ఎన్నికల్లో గెలిచి మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి గులకరాయి డ్రామాలకు తెరతీశాడని దుయ్యబట్టారు. ఈ సారి ప్రజల ముందు డ్రామాలు చెల్లకపోవడంతో ఓటమి పాలై ఇంట్లో కూర్చున్నాడని ఎద్దేవా చేశారు. నా గౌడ కులస్తులు..నా రక్త సంబంధీకులు అంటున్న జోగికి ఇప్పుడు కులం గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. పెడన నియోజకవర్గంలో సొంత కులస్తుల వద్ద ఎంత దోచుకున్నావో అందరికీ తెలుసని, నీకులంలో ఉన్న పేదవారిని ఏరోజయినా ఆదుకున్నావా అని నిలదీశారు. సమావేశంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్ ప్రసాద్, యార్లగడ్డ సుచిత్ర, సంగెపు రంగారావు, తాతపూడి గణేష్, పీతా గోపీచంద్, శొంఠి శివరాంప్రసాద్, బొర్రా వెంకట్, కూటమి మహిళానేతలు పాల్గొన్నారు.

ఆరోగ్యం మన చేతుల్లోనే..!



- పరిశుభ్రమైన చేతులతోనే సంపూర్ణ ఆరోగ్యం
- ఇన్‌ఫెక్షన్లకు కారణం చేతుల అపరిశుభ్రతే
- చిన్నపిల్లలకు అవగాహన తప్పనిసరి
- అపరిశుభ్ర చేతులతో పది రకాల వ్యాధులు వ్యాప్తి
- చేతులు శుభ్రం చేసుకోవడానికి కనీసం 15 సెకన్లు తప్పనిసరి

చేతులు పరిశుభ్రంగా ఉంటే సగం ఆరోగ్యం పదిలంగా ఉన్నట్టే. ఎందుకంటే మనం రోజూ తినే ఆహార పదార్థాల నుంచి ఇతర కార్యక్రమాల వరకు అన్నీ మన చేతుల్లోనే ఉన్నాయి. అటువంటప్పుడు చేతులు అపరిశుభ్రంగా ఉంటే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. ఆహార పదార్థాలు తినే ముందు చేతులను శుభ్రం చేసుకోవడం వల్ల అనేక రకాల ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు బారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉంది. అయితే చేతుల శుభ్రతకు ఒక పద్ధతి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. చాలామందికి అవగాహన లేక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. చిన్నారులు చీటికిమాటికి చేతులను నోటిలో పెట్టుకోవడం వలన ఇన్‌ఫెక్షన్ల ముప్పు ఎక్కువగా ఉంటుందని, వారు చేతులను శుభ్రం చేసుకోవడంపై అవగాహన తప్పనిసరని వైద్యులు చెబుతున్నారు. ఈ ఏడాది 'గ్లౌవ్స్ వేసుకున్నా చేతులను పరిశుభ్రంగా ఉంచుకుందాం' అనే థీమ్‌తో నేడు వరల్డ్ హ్యాండ్ వాష్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం. - ఆంధ్రజ్యోతి - విజయవాడ

నేడు అంతర్జాతీయ హ్యాండ్ వాష్ డే

చేతుల పరిశుభ్రతతో కొన్ని రకాల వ్యాధులకు దూరంగా ఉండేందుకు అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కలిగించాలన్న ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి 2008 నుంచి వరల్డ్ హ్యాండ్ వాష్ డే నిర్వహిస్తోంది. దేశంలో హ్యాండ్ వాష్ డేను ప్రమోట్ చేస్తూ ఎంతో మంది సెలబ్రిటీలు అవగాహన సదస్సులు నిర్వహించారు.

గ్లౌవ్స్ వాడకంతో శుభ్రంగా ఉన్నట్టా..?

వైద్య రంగంతోపాటు మరికొన్ని రంగాల్లో పనిచేసే సిబ్బంది చేతులకు గ్లౌవ్స్ ధరించి పనులు చేస్తుంటారు. చాలామంది గ్లౌవ్స్ ధరించామన్న ఉద్దేశంతో చేతులను శుభ్రంగా ఉన్నట్టు భావిస్తుంటారు. అది నిజం కాదు. గ్లౌవ్స్ ధరించినా తినేముందు చేతులు శుభ్రపరచుకోకపోతే ఇన్‌ఫెక్షన్లకు కారణమయ్యే వైరస్‌లు, బాక్టీరియాలు చేతుల్లో ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఆయా సెక్టార్స్‌లో పనిచేసే ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకే ఈ ఏడాది థీమ్‌గా ఎంపిక చేశారు.

ప్రతి ఒక్కరూ చేసుకోవాలి

చేతులను శుభ్రంగా ఉంచుకోవడమన్నది వ్యక్తిగత విషయం. ఇంట్లో తిరిగాడే పిల్లాడి నుంచి, ఇంటి, వంట పనిలో బిజీగా ఉండే గృహిణి, ఉద్యోగులు, కార్మికులు వృత్తిగత, వ్యక్తిగత కార్యక్రమాల వల్ల వేల బాక్టీరియాలు చేతుల్లోకి చేరే అవకాశముంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాటిని నాశనం చేయాలంటే చేతులను ఎప్పటికప్పుడు శుభ్రంగా శానిటైజర్ లేదా సబ్బుతో కడుక్కోవడం ఉత్తమం.

చేతులు శుభ్రమేనా..?

సాధారణంగా చాలామంది మనమేం చేయలేదులే చేతులు శుభ్రంగా ఉన్నాయని భ్రమలో ఉండడంతో కడగడానికి ఇష్టపడరు. ఒకవేళ కడగాల్సి వచ్చినా తూతూమంత్రంగా కానిచ్చేస్తారు. చేతులు శుభ్రంగా ఉన్నట్టు కనిపించినా బాక్టీరియాలు చేతుల్లో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. సూక్ష్మదర్శినితో పరిశీలిస్తే లక్షల బాక్టీరియాలు కనిపిస్తాయని, చేతులను శుభ్రం చేసుకోకుండా ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల అవి శరీరంలోకి ప్రవేశించి అనేక వ్యాధుల బారినపడేలా చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

పది రకాల వ్యాధుల నుంచి రక్షణ

చేతులను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల 10 నుంచి 30 రకాల వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. చేతులను పరిశుభ్రం చేసుకోకుండా ఆహార పదార్థాలు నేరుగా తినడం వల్ల విరేచనాలు, వాంతులు, పచ్చకామెర్లు, టైఫాయిడ్, న్యుమోనియా, మెదడువాపు వ్యాధి, కళ్ల కలక, చర్మ వ్యాధులు, అమీబియాసిస్ (కడుపునొప్పి, రక్తంతో కూడిన విరేచనాలు), స్వైన్ ఫ్లూ, టీబీ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. చేతులను శుభ్రం చేసుకోకపోవడంతో ఏటా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది చిన్నారులు వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురై మృతి చెందుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. చేతులను శుభ్రం చేసుకోవడం వల్ల ఈ జబ్బుల్లో 80 శాతం నివారించవచ్చు. చేతులను శుభ్రంగా కడగడం అంటే సబ్బు/లిక్విడ్‌తో కనీసం 30 నుంచి 60 సెకన్లపాటు కడగాలి. లేదా పరిస్థితిని బట్టి కనీసం 30 సెకన్లయినా కడగాలి. చేతులను కడిగే సమయంలో వేళ్లమధ్యలో, గోళ్లను శుభ్రపరుచుకోవాలి. చేతులను శుభ్రం చేసుకున్న అనంతరం పొడి వస్త్రంతో తుడ్చుకోవాలి.

పరిశుభ్రమైన చేతులతో వ్యాధులకు దూరం

ప్రశాంతి, మైక్రోబయాలజీ ప్రొఫెసర్, సిద్ధార్థ మెడికల్ కాలేజీ



చేతులను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం వల్లే 90శాతం శ్వాసకోస, జీర్ణ వ్యవస్థ, చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయి. పిల్లలకు హ్యాండ్ వాష్ పట్ల అవగాహన కలిగించాలి. ఆసుపత్రిలో ఉన్న రోగుల సహాయకులయితే కచ్చితంగా రోగిని తాకిన వెంటనే, తినడానికి ముందు, ఏదైనా వస్తువును ముట్టుకున్నప్పుడు చేతులు శుభ్రం చేసుకోవడం తప్పనిసరి. ఈ ఏడాది థీమ్ ప్రకారం హెల్త్ కేర్ రంగంలో పనిచేసే వాళ్లు గ్లౌవ్స్‌ను ధరించడం వల్ల చేతులు పరిశుభ్రంగా ఉంటాయని భావిస్తుంటారు. కానీ వందశాతం శుభ్రంగా ఉన్నట్టు కాదు. గ్లౌవ్స్ తీసిన తరువాత చేతులను మళ్లీ శుభ్రం చేసుకోవడం ద్వారా మాత్రమే చేతులు శుభ్రంగా ఉన్నట్టు.

ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరవు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఖరీఫ్ ధాన్యం సేకరణకు పగడ్బందీ ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ 2025-26 ధాన్యం సేకరణకు సంబంధించి పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో మంగళవారం జిల్లాస్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఎస్ ఇలక్కియాతో కలిసి పాల్గొన్నారు. పౌరసరఫరాలు, వ్యవసాయం, సహకార ఇతర శాఖల అధికారులు, కస్టోడియన్ అధికారులు తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లా మొత్తంలో 3,59,733 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తిని అంచనా వేయగా ప్రాథమికంగా సుమారు 3,03,154 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 159 రైతు సేవా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పౌర సరఫరాల డీఎంటీ వెంకట్ సతీష్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, తిరువూరు ఆర్డీవో కే మాధురి, నందిగామ ఆర్డీవో కే బాలకృష్ణ, డీఎస్‌వో పాపారావు, జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

లక్ష్యసాధనకు అధికారులు కృషి చేయాలి

కీలక ప్రగతి సూచికల (కేపీఐ) లక్ష్యాల సాధనకు ప్రతి శాఖ కృషి చేయాలని, ఇందుకు సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కీలక ప్రగతి సూచికలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేపీఐల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. వార్షిక తలసరి ఆదాయ వృద్ధితో పాటు వృద్ధిరేటు 18శాతం ఉండాలన్న లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. రైతులు, కౌలు రైతులకు రుణాల మంజూరు లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలన్నారు. మత్స్య రంగ (ఫిషరీల) విస్తరణపై దృష్టిసారించాలని, సహకార సంఘాల పురోగతిని తెలియజేయాలన్నారు. ధాన్యం ప్రతి మంగళవారం కీలక ప్రగతి సూచికలపై సమావేశం నిర్వహిస్తామని, జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. సీపీవో వై శ్రీలత, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించండి

గుణదల: వసతిగృహాల్లో ఉంటూ విద్యాభ్యాసం చేసే విద్యార్థినిలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన గురుతర బాధ్యత సిబ్బందిపైనే ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గుణదల్లోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ వసతి పొందుతున్న బాలికలకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. వారితో కలిసి ఉదయం అల్పాహారం తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వసతి గృహాలపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, ఇందుకు గాను ఒక్కో వసతి గృహానికి ఒక జిల్లా అధికారిని ప్రత్యేక అధికారిగా బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. వీరు వారానికి 2 సార్లు వసతి గృహాలను సందర్శించి అన్ని అంశాలను పరిశీలించి ఆన్‌లైన్లో నివేదికలు సమర్పిస్తారన్నారు. వసతిగృహాల్లో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్న వారితో కెరీర్ గైడెన్స్, మెడిటేషన్ తరగతులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. వసతిగృహ ప్రత్యేక అధికారి డీపీవో పీ లావణ్య కుమారి, వసతిగృహ సంక్షేమ అధికారి ఏ రజనీ కుమారి సిబ్బంది పాల్గొన్నారు.

నాటకరంగ పరిరక్షణలో గోపాలుడు

- బొబ్బిళ్లపల్లి సాయి సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం
- నేడు రవీంద్ర భారతిలో సంగమం జీవన సాఫల్య పురస్కారం



ఆంధ్రజ్యోతి, నందిగామ: మూడు దశాబ్దాల క్రితం వరకూ ప్రజలను ఉర్రూతలూగించిన రంగస్థల కళారంగం రానురానూ తన ప్రాభవాన్ని కోల్పోతూ వస్తోంది. ఈ తరుణంలో బొబ్బిళ్లపల్లి గోపాలకృష్ణ సాయి అనే ఒక సామాన్యుడు గతించిపోతున్న రంగస్థల వైభవానికి జీవం పోశారు. మణులు, మాన్యాలు లేకపోయినా కళాకారుల కడుపు నింపి రంగస్థల నాటక రంగాన్ని కాపాడేందుకు స్వశక్తితో నడుంబిగించారు. ఆయన సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం సంగమం జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసింది. బుధవారం (నేడు) రవీంద్రభారతిలో అవార్డు తీసుకోబోతున్నారు.

ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం బొబ్బిళ్లపాడు గ్రామానికి చెందిన నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ కాంగ్రెస్ తరపున 1985, 1994లో నందిగామ నుంచి శాసనసభకు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. మూడున్నర దశాబ్దాల పాటు గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశారు. నాటకాలపై మక్కువతో కళాకారుల బాధలకు చలించిపోయారు. బళ్లారి రాఘవ కళాసమితిని స్థాపించి గుమ్మడి గోపాలకృష్ణ, డీవీ సుబ్బారావు, బీసీ కృష్ణ, చీమకుర్తి నాగేశ్వరరావు, అరిగెల జేమ్స్, గూడూరు సావిత్రి, వంటి పద్యనాటక అగ్ర కళాకారులతో కళాప్రదర్శనలు ఇప్పిస్తూ వచ్చారు. వయోభారంతో ఆరోగ్యం సహకరించపోయినా ప్రతి ఏడాది అద్భుతమైన కళా రూపాలను ఏర్పాటు చేస్తూ కళాభిమానులకు కనువిందును, కళాకారులకు జీవనోపాధిని కల్పిస్తున్నారు. వైసీపీ హయాంలో కళాకారులకు పెన్షన్లు ఎత్తివేయడంతో వేలాది మంది కళాకారులతో రాష్ట్రవ్యాప్త మహా ఉద్యమం నిర్మించారు. గోపాలకృష్ణ సాయిని పలు అవార్డులు వరించాయి. సువర్ణ నంది అవార్డుతో పాటు తెలుగు వర్సిటీ నుంచి అవార్డులు అందుకున్నారు. తానా సాదరంగా ఆహ్వానించినా ఆర్థిక ఇబ్బందులతో వెళ్లలేకపోయారు. ఎన్టీఆర్ పరిషత్ సంస్థ శ్రీ భారతీయుడు అవార్డుతో సత్కరించింది.

సంగమం జీవన సాఫల్య పురస్కారం

బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ సాయి సామాజిక, సాంస్కృతిక జీవిత వజ్రోత్సవాలను సంఘం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈనెల 15న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదగా సంగమం జీవన సాఫల్య పురస్కారం అందిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, శాసన సభ్యులు, కళా అభిమానులు పాల్గొంటున్నారు.

గూగుల్‌తో ఒప్పందం రాష్ట్ర చరిత్రలో

సువర్ణాధ్యాయానికి నాంది

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ఎంపీ శివనాథ్ ఘన స్వాగతం



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ

వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్టణంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణాధ్యాయానికి నాంది పలికారని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటుకు ఢిల్లీలో ఒప్పందం చేసుకుని మంగళవారం ఉండవల్లి తిరిగి వచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను వారి నివాసం వద్ద ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ ఘన స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు పుష్పగుచ్ఛం అందించారు. విశాఖను ఏఐ సిటీగా తీర్చిదిద్దబోతున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా గూగుల్ సంస్థ సుమారు 15 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుందని ఎంపీ తెలిపారు. నిరుద్యోగ యువతకి ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఓల్డ్‌టైర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఓల్డ్ టైర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ ఫక్కర్ అహ్మద్ (బాబు) మర్యాదపూర్వకంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిశారు. మంగళవారం గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఓల్డ్‌టైర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బృందం ఆయన్ను కలిసింది. ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈనెల 7న ఓల్డ్‌టైర్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో షేక్ ఫక్కర్ అహ్మద్ (బాబు) అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా 218 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్టు ఎంపీకి తెలిపారు. నూతన అధ్యక్షుడు బాబుకు ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఇర్ఫాన్, ఓల్డ్‌టైర్ అసోసియేషన్ సభ్యులు ఎస్ఎస్ఎస్ హుస్సేన్ బాబా, షేక్ మస్తాన్ వలి, షేక్ బాజీ, జీ గంగరాజు, అబ్దుల్ అజీస్ పాల్గొన్నారు.



చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన డూండీ

ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌ను మంగళవారం ఉండవల్లిలోని వారి నివాసంలో ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. గూగుల్ సంస్థ పెట్టుబడులను ఏపీకి తీసుకురావటానికి కీలకపాత్ర పోషించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు అభినందనలు తెలిపారు.

ఊహించిన దానికంటే ఎక్కువ అభివృద్ధి

- సిబ్బందిని ప్రశంసించిన ఎంపీ చిన్ని
- జీజీహెచ్‌లో అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం
- ఆసుపత్రి ఏర్పాట్లపై ఎంపీ, కలెక్టర్ ఆరా

విజయవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏమేమి లోటుపాట్లు ఉన్నాయో, ఇప్పటి వరకు నిధులెన్ని ఖర్చుపెట్టారు.. ఇంకా ఏయే అవసరాలు ఉన్నాయనే విషయంపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ తాము ఊహించిన దానికన్నా ఎక్కువగా అభివృద్ధి డాక్టర్లు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేయలేని ఆపరేషన్స్‌ను సైతం ప్రభుత్వాసుపత్రిలో చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. డాక్టర్స్ అడిగిన రిక్రూట్‌మెంట్ త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎప్పకప్పుడు కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెస్తున్నామని, త్వరలోనే కొత్త బిల్డింగ్ నిర్మాణం పూర్తయితే మరిన్ని అధునాతన పరికరాలను ఏర్పాటుచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్లు రోగులకు మంచి సేవలందిస్తున్నారన్నారు. సరైన సమయంలో సరైన వైద్యం అందిస్తున్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు తమను అభినందిస్తున్నారని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏ వెంకటేశ్వర్లు అన్నారు. ఆసుపత్రికి కావాల్సిన కొన్ని అత్యాధునిక పరికరాల కోసం కలెక్టర్, ఎంపీకి వివరించామన్నారు. వాటిని వెంటనే అందిస్తామన్నారని, తాము అడిగిన ప్రతిపాదనలన్నిటికీ ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ ఒప్పుకోవడం సంతోషమన్నారు. ఈ మీటింగ్‌లో పలు అంశాలకు సంబంధించిన బిల్లులకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. పలు విభాగాలకు చెందిన హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

రాష్ట్ర పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో

రైల్వే ఉద్యోగికి రెండు కాంస్యాలు



రైల్వేస్టేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఈనెల 12న జరిగిన 7వ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు కాంస్య పతకాలు గెలుచుకుని సంస్థకు కీర్తిప్రతిష్టలు తెచ్చి న కే లవయ్యను అధికారులు అభినందించారు. అసాధారణ నైపుణ్యం, దృఢ సంకల్పం, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించిన లవయ్య 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 50 మీటర్ల ఫ్రీస్టైల్ ఈవెంట్లలో కాంస్య పతకాలను గెలుచుకున్నాడు. తెనాలిలో పార్శిల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వాణిజ్య విభాగానికి చెందిన లవయ్య మంగళవారం డీఆర్ఎం మోహిత్ సొనాకియాను కలవగా ఆయన అభినందించారు. జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న అతడికి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- అధికారులకు ఎమ్మెల్సీ విజ్ఞప్తి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

గవర్నర్‌పేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కళాశాలలు, పాఠశాలల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మంగళవారం విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. పాఠశాల కమిషనర్ విజయ రామరాజు, ఇంటర్, డిగ్రీ కమిషనర్ నారాయణ భారత్ గుప్తా, ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ భార్గవ్‌ను కలిసి సమస్యలను వివరించారు. ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ ఆర్థిక ఆమోదంతో తదుపరి చర్యలు చేపట్టాలని, వెల్ఫేర్ పాఠశాలలు ఉపాధ్యాయుల క్లస్టర్ మీటింగ్ 100 శాతం హాజరు మినహాయింపు ఇవ్వాలని కోరారు. మనబడి-మనభవిష్యత్తు పాఠశాలల అసంపూర్తి పనులు పూర్తి చేయాలని, ప్లస్-2 ఉన్నత పాఠశాలల్లో పీజీటీ ఖాళీలు నింపాలని, ఉన్నత పాఠశాలల్లో పీఈటీలకు పీడీ పదోన్నతులు ఇచ్చి ఇన్ సర్వీస్‌కు అవకాశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. పదోన్నతుల అంతర్ జిల్లా సమస్యలు పరిష్కరించాలని, ఉన్నత పాఠశాలల్లో పీఈటీలకు పీడీ పదోన్నతులివ్వాలని, ఏపీ మోడల్ స్కూల్‌లో పాఠశాల సమయాన్ని 9 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించాలని, గోదావరి బాలోత్సవం 3వ పిల్లల పండుగ నిర్వహించుకునేందుకు ఎస్‌కెవీటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుమతి ఇవ్వాలని కోరారు.

జగన్ రెడ్డి, జోగి రమేష్, జనార్ధనరావుది పెవిక్విక్ బంధం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న)

వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం వ్యాపారంలో జగన్ రెడ్డి, జోగి రమేష్, జనార్ధనరావు బంధం పెవిక్విక్ బంధమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) అన్నారు. మంగళవారం హనుమాన్‌పేట తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నకిలీ మద్యంపై గతంలో తాను మాట్లాడిన విధంగానే నిజాలు నిర్భయంగా బయటికి వచ్చాయన్నారు. నకిలీ మద్యం లిక్కర్ స్కామ్‌ను ఎక్సైజ్ పోలీసులు పట్టుకోగానే, సాక్షి మీడియాని తీసుకొని వెళ్లి హడావుడి చేశారని తెలిపారు. మాజీ మంత్రి జోగి రమేష్‌కి నకిలీ లిక్కర్ స్కామ్‌కి, ఖచ్చితమైన సంబంధం ఉందని ఈ కేసులో ప్రధాన నిందితుడైన జనార్ధన రావు మాటలలో స్పష్టమైందని వెల్లడించారు. ఒక మాజీ మంత్రిగా పనిచేశానని మర్చిపోయి, కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులపై మీడియా కాన్ఫరెన్స్‌లో అసంబద్ధమైన ప్రేలపణలు, బాధ్యతారాహిత్యమైన మాటలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని విమర్శించారు. జోగి రమేష్ చేసే పనులకు గుడిలో ఉన్న దేవుళ్లకి, ఇళ్లల్లోని ఆడవాళ్ళకి ఏం సంబంధమని ప్రశ్నించారు? గతంలో సీఎం జగన్మోహన్ రెడ్డి వద్ద పేరు తెచ్చుకోవాలనే ఉద్దేశంతో, మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన నీచమైన వ్యక్తి జోగి రమేష్ అని అన్నారు. వైసీపీ నాయకుల్లాగా, తెలుగుదేశం పార్టీ నాయకులకి కార్యకర్తలకి కార్యాలయాలపై, ఇళ్లపై దాడి చేసే సంస్కృతి లేదన్నారు.

రైళ్లలో చోరీల నిందితుడి అరెస్టు

- రూ.3.68 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



నిందితుడు ఫణీంద్ర రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు

రైల్వేస్టేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికుల వద్ద నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు దొంగిలిస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన ముల్పూరి ఫణీంద్ర రెడ్డి (36)ని మంగళవారం విజయవాడ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.3,68,000 విలువైన బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, వేజెండ్ల గ్రామానికి చెందిన ఫణీంద్ర రెడ్డి రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికుల వద్ద బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు, నగదు చోరీకి పాల్పడుతున్నాడు. ఇటీవల విజయవాడ రైల్వే పోలీసు స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్‌పీ సీఐ జేపీ రమణ, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఫతే ఆలీ బేగ్ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో వారు స్టేషన్ ప్రాంగణంలో సీసీ ఫుటేజ్‌ని పరిశీలించి నిందితుడి ఆచూకీని కనుగొన్నారు. నిందితుడు పాత నేరస్థుడు ఫణీంద్ర రెడ్డి అని గుర్తించారు. మంగళవారం వన్‌టౌన్ శివాలయం వీధిలో నిందితుడు ఉన్నట్టు గుర్తించి పోలీసులు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించి దొంగిలించిన రూ.3,68,000 విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్ఈఎంఎస్ పథకం అమలు చేయాలి

- ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నేతలు

బస్‌స్టేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో రిటైర్డ్ ఉద్యోగులకు గతంలో ఉన్న ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ మెడికల్ స్కీమ్ (ఆర్ఈఎంఎస్)ను అమలు చేయాలని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోధరరావు, జీవీ నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనానికి ముందు ఆర్ఈఎంఎస్ పథకాన్ని కావాలనుకునే ఉద్యోగులు కొంతమేర డబ్బు చెల్లించేవారని, రిటైరయ్యాక భార్యాభర్తలు ఆర్టీసీ ఆసుపత్రిలో వైద్యం పొంది, మందులు తీసుకునేందుకు అవకాశం ఉండేదని పేర్కొన్నారు. విలీనం అనంతరం 2020 నుంచి ఈ పథకాన్ని నిలిపివేసినప్పటి నుంచి సుమారు 6 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు వైద్య సౌకర్యాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఈ పథకం యధావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకుని రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550



వరద విపత్తులపై అవగాహన

తోట్లవల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్ఐడీఎం) అంతరాష్ట్ర ట్రైనింగ్ ఉద్యోగులు 60 మంది మంగళవారం పాములలంక వచ్చారు. తహసీల్దార్ ఎం కుసుమకుమారి, ఆర్ఐ హేమ, వీఆర్వో నాంచారయ్య వీరిని పాములలంక తీసుకొచ్చి వరద విపత్తులపై అవగాహన కల్పించారు. అలాగే అక్కడి ప్రజల నుంచి పలు అంశాలను తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా వీరు పాములలంక వచ్చి వరద విపత్తు సంభవిస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశాలపై అవగాహన పొందారు.



అవగాహన కార్యక్రమంలో ఎన్ఐడీఎం ట్రైనింగ్ ఉద్యోగులు

వణికిస్తున్న వానరాలు

- గుంపులుగా ఇళ్లపైకి చేరిన కోతులు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

(కూచిపూడి - ఆంధ్రజ్యోతి): గత రెండేళ్ల నుంచి వానరాలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని చినముత్తేవి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందల సంఖ్యలో కోతుల మందలు వచ్చి పంటను నాశనం చేయటమే కాకుండా పూలమొక్కలు, పండ్ల మొక్కలు ధ్వంసం చేస్తున్నాయి. పొలాలకు వెళ్లాల్సిన మేము ఇంటి వద్ద ఎవరో ఒకరు కాపలా ఉండాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. ఇళ్లల్లోకి చొరబడి ఇంటిలోని వస్తువులు చిందరవందర చేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, చిన్నారులను గాయపరుస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నాయి. దుకాణాల నుంచి తీసుకుని వచ్చే సరుకులు, పాల ప్యాకెట్లు చే తుల నుంచి లాక్కుని వెళ్లిపోతున్నాయన్నాయన్నారు. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి కోతుల బెడద సమస్యను పరిష్కరించాల్సిందిగా గ్రామస్థులు వేడుకుంటున్నారు.

ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి



ఇళ్లల్లోకి చొరబడి సరుకులు, వస్తువులు, పప్పులు, ఆహార పదార్థాలు నాశనం చేస్తున్నాయి. రెండు సంవత్సరాల నుంచి ఇబ్బందులు పడుతున్నాం. చిన్న పిల్లలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. తెల్లారితే భయంభయంగా గడపాల్సి వస్తుంది. పెరటిలోని పూల, పండ్ల మొక్కలు ధ్వంసం చేస్తున్నాయి.

రంగాదేవి, గృహిణి



గుంపులుగా ఇళ్లపైకి చేరిన కోతులు

పంటలు నాశనం చేస్తున్నాయి



పంటలను నాశనం చేస్తూ తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయి. ఇళ్లవద్ద, పొలాల్లో రహదారుల వెంట ఎక్కడి చూసినా కోతులు గుంపులుగా కనిపిస్తున్నాయి.ఎంటలను నాశనం చేయటంతోపాటు మనుష్యలను గాయపరుస్తున్నాయి.

నాగేంద్రం, రైతు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

గుడివాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ అన్నారు. మంగళవారం వార్డు పర్యటనలో భాగంగా 31వ వార్డులో పర్యటించారు. స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద తెరచి ఉన్న మ్యాన్ హోల్‌ను వెంటనే మూసివేయాలని ఆదేశించారు. మూసుకుపోయిన డ్రైయిన్లు, కల్వర్టులను వెంటనే శుభ్రపరచాలని, తాలుకా బ్యాంకు వద్ద కచ్చా డ్రైయిన్‌లను తవ్వాలని సూచించారు. రహదారి విస్తరణలో అంచనాల్లో ఉన్న పోస్టాఫీసు రోడ్డును సందర్శించారు. మున్సిపల్ శానిటరీ సిబ్బంది, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

తోట్లవల్లూరు: పాములలంకలో పాము రక్త పింజరి పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న పాముల రాధాకృష్ణ(78) మంగళవారం మృతి చెందాడు. ఆదివారం తన పొలంలో మందు పిచికారి చేస్తుండగా రక్త పింజరి పాము కాటుకు గురయ్యాడు. తోట్లవల్లూరు పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స తీసుకున్నాడు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంచాయతీల్లో రికార్డుల పరిశీలన

గుడ్లవల్లేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు మండలంలో మూడు గ్రామ పంచాయతీలకు ప్రస్తుతం పాలకవర్గాలు లేని విషయంపై, ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదనే అంశంపై ఆ మూడు పంచాయతీల కార్యదర్శులతో మంగళవారం గుడివాడ ఆర్డీవో జి.బాల సుబ్రహ్మణ్యం సమీక్ష నిర్వహించారు. గుడివాడ ఆర్డీవో కార్యాలయానికి గుడ్లవల్లేరు, కూరాడ, కౌతవరం పంచాయితీల కార్యదర్శులను, ఎంపీడీవోలను పిలిపించి సంబంధిత విషయాలపై రికార్డులను ఆర్డీవో పరిశీలించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఈ మూడు పంచాయతీలకూ ఎన్నికలు జరిగేలా చర్యలు చేపడతామని ఆర్డీవో వారికి చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్, గుడ్లవల్లేరు కార్యదర్శి నరసింహారావు, కౌతవరం కార్యదర్శి ఇన్‌చార్జ్ బి.రమణ, కూరాడ ఇన్‌చార్జ్ కార్యదర్శి ఎలీషారావు పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్‌తో ఉద్యోగాలు మెండు

పమిడిముక్కల : విశాఖపట్టణంలో ఏర్పాటుచేసిన గూగుల్ సెంటర్‌తో సాఫ్ట్‌వేర్ రంగంలో వేలాదిమంది యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబునాయుడు విశేషంగా కృషిచేశారని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. మేడూరులో మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో కలసి ముఖ్యమంత్రి ప్రారంభించిన గూగుల్ సెంటర్‌తోయువతకు ఉద్యోగాలు ఏర్పాడతాయన్నారు. విజనరీ కలిగిన ముఖ్యమంత్రిగా విజన్ 2047కు ఏపీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నారన్నారు. అదేస్ఫూర్తితో విశాఖపట్టణంలో సాఫ్ట్ వేర్ అభివృద్ధి చేస్తారనడంలో సందేహం లేదన్నారు.

గంగానమ్మ నూతన విగ్రహం రాక నేడు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో వేంచేసియున్న గంగానమ్మ అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ సందర్భంగా మహాబలిపురం నుంచి అమ్మవారి నూతన విగ్రహం బుధవారం గ్రామానికి విచ్చేస్తుందని ఆలయ నిర్మాణ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామానికి ఊరేగింపుగా వస్తున్న విగ్రహానికి గ్రామస్థులు, భక్తులు అమ్మవారికి టెంకాయలు, పువ్వులు, పండ్లు హారతులు ఇచ్చి పసుపునీరు వారపోసి గంగానమ్మ అమ్మవారికి ఘనస్వాగతం పలికారు.

దీపావళికి ముందస్తు జాగ్రత్తలను పాటించాలి

● ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : దీపావళికి ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ, ప్రమాదాల నివారణ చర్యలను తీసుకోవాలని ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, అదాయ పన్ను శాఖ, విద్యుత్ శాఖ, తహసీల్దార్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్ శాఖలు నిర్ణయించిన స్థలాల్లో తాత్కాలికంగా బాణసంచా అమ్మకాల దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు. తాత్కాలిక బాణసంచా లైసెన్సులు కేవలం మూడు రోజులు మాత్రమేన్నారు. లైసెన్సు పొందినవారు చిన్నపిల్లలను పనిలో పెట్టుకోరాదని, 18శాతం జీఎస్టీసీ తప్పనిసరిగా చెల్లించాలన్నారు. పనిచేసేవారికి ప్రమాద బీమా నమోదు చేసుకోవాలన్నారు. ఆయా దుకాణాల వద్ద నీరు, ఇసుక, అగ్నిమాపక శాఖ వారు సూచించిన విధంగా రక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు. బాణసంచా దుకాణదారులు రేకుతో కప్పబడిన దుకాణాలను మాత్రమే ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ధీరజ్ వినీల్, గుడివాడ, హనుమాన్ జంక్షన్ అగ్నిమాపక శాఖ జిల్లా సహాయక అధికారి, పోలీసు అధికారులు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యం

గృహ ప్రవేశాలకు లబ్ధిదారులు సిద్ధం కావాలి

● కలెక్టర్ డీకే బాలాజీ

పామర్రు,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ గృహ కల్పయోజన పథకం ద్వారా నిర్మితమవుతున్న గృహాలను జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో త్వరలో జరగబోయే గృహప్రవేశాలకు త్వరితగతిన సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మండల పరిధిలోని జుజ్జవరంలో తుది దశలో నిర్మాణంలో ఉన్న లబ్ధిదారుల గృహాలను సంబంధిత అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ గృహ కల్పయోజన పథకం ద్వారా నిర్మితమైన గృహాల గృహప్రవేశాలకు సీఎం చంద్రబాబుచేత ప్రారంభించే అవకాశాలు ఉన్నాయన్నారు. దానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాల పనులు వేగవంతంగా జరిగేందుకు అధికారులు లబ్ధిదారులకు సహకరించాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా 66 ఇళ్ల నిర్మాణాలకు మంజూరు కాగా వాటిలో 56మంది నిర్మాణాలు చేపట్టగా 33 మాత్రమే పూర్తియ్యాయని పామర్రు హౌసింగ్ ఏఈ పవన్ కల్యాణ్ కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన వాటిని యుద్ధప్రతిపాదికన సిద్ధం చేసేందుకు లబ్ధిదారులకు అందించవలసిన బిల్లులు చెల్లింపులు, ఇసుక, స్టీల్, సిమెంట్ ఇతర సామగ్రి అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.జ్యోతి, గృహనిర్మాణ సంస్థ పీడీ పోతురాజు, ఈఈ బుచ్చిబాబు, తహసీల్దార్ రవికాంత్, ఇంజనీరింగ్ సహాయకులు భవాని,సర్వేయర్ లక్ష్మి దుర్గ, వీఆర్వో బేబిసరోజిని తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

గ్రామాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధి చేయాలి

● జడ్పీ సీఈవో కన్నమ నాయుడు

గుడ్లవల్లేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాల్సిన గ్రామస్థాయి సైనికులు పశుసంవర్ధక సహాయకులే అని ప్రజాపరిషత్ జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి కన్నమనాయుడు అన్నారు. మంగళవారం గుడ్లవల్లేరులోని పశుసంవర్ధకశాఖ డివిజనల్ కార్యాలయంలో పశువులకు వ్యాప్తి చెందే వ్యాధులపై పశు సంవర్ధక సహాయకులకు శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక సహాయకులు పాడిపరిశ్రమకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ నిష్ణాతులై ఉండాలన్నారు. కార్యక్రమాన్ని తొలుత కన్నమనాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖఅధికారి డాక్టర్ చిననరసింహులు, గుడ్లవల్లేరు డివిజన్ ఉపసంచారకులు డాక్టర్ శ్రీనివాస్, డీడీ డాక్టర్ జనన్నాథరావు, ఎన్‌జీవో డాక్టర్ సోహెల్, పశువైద్యులు హనుమంతరావు, రాజీవ్, గుడ్లవల్లేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహమ్మద్ ఇమ్రాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో కన్నమ నాయుడు

గుడివాడ రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ముందుండాలని జడ్పీ సీఈవో కన్నమనాయుడు అన్నారు. రామన్నపూడి గ్రామంలో సీఈవో మంగళవారం పర్యటించారు. పరిసరాల పరిశుభ్రత, చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు.

రామాలయంలో అనధికార వసూళ్లపై విచారణ

గుడివాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల మోటూరుకు చెందిన ఘంటా శ్రీనివాసరావు శ్రీసీతారామ స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న అవినీతి, అన్నసమారాధన సంఘం పేరుతో చేస్తున్న అనధికార వసూళ్ళపై జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీకి ఫిర్యాదు చేశారు. మంగళవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు మోటూరులోని సీతారామస్వామి వారి దేవస్థానానికి విచారణ నిమిత్తం వచ్చారు. దేవస్థానం చేపట్టాల్సిన అన్న సమారాధనను సంఘం పేరుతో ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్నారని, రామాలయం పేరు చెప్పి అన్నసమారాధనకు వసూళ్ళు చేస్తున్నారని, దీనికి దేవస్థాన కార్యనిర్వహణాధికారులు సైతం సహకరిస్తున్నారని శ్రీనివాసరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు ఫిర్యాదుదారుడు శ్రీనివాసరావుతో ఫోన్‌లో రాజీ యత్నాలు చేశారు. ఆలయ సిబ్బంది ఉద్యోగాలు పోతాయని, వెంటనే ఇచ్చిన ఫిర్యాదును వాపసు తీసుకోవాలని, గతంలో ఘంటా శ్రీనివాసరావుపై ఆలయ ఈవో మౌనిక, గుడివాడ తనిఖీదారు సుధాకర్‌లు పెట్టిన కేసును వాపసు తీసుకుంటామని ఫిర్యాదుదారునితో పేర్కొన్నట్లు సమాచారం.



మోటూరు రామాలయాన్ని సందర్శించిన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు

లక్ష్మీదేవిగా అష్టలక్ష్మీ అమ్మవారు

గుడివాడ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన ఎరుకపాడులో వేంచేసి ఉన్న అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ బొప్పుడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మహిళల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న పూర్ణచంద్రారెడ్డి

కరాటేలో ఏఎన్ఎం విద్యార్థుల ప్రతిభ

పామర్రు : విద్యార్థి దశనుంచే చదువుతోపాటు కరాటే శిక్షణ పట్ల మక్కువ పెంచుకోవడం ద్వారా స్వీయ రక్షణకు దోహదపడుతుందని ఏఎన్ఎం హైస్కూల్ ప్రిన్సిపాల్ అన్నపురెడ్డి పూర్ణచంద్రరెడ్డి అన్నారు. ఈనెల 12న తమిళనాడులోని చైన్నెలో జరిగిన కరాటే చాంపియన్ షిప్‌లో -25 పోటీలో ఆపాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి బహుమతులు సాధించారు. అండర్12 విభాగంలో డి.భువనశ్రీజ, డి.ఝాన్సీలక్ష్మిలతోపాటుగా ఎస్.శ్రీప్రియ, మణికంఠ, వి.హర్షిత, కె.మురారిలు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచి బంగారు, వెండి పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించారు. విజేతలైన విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శామ్యూల్ పాఠశాలలో అభినందించారు. కోచ్ రామకృష్ణ, పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య నేతలు

కూటమిలోనే ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం

గుడివాడ : కూటమి ప్రభుత్వం అధికారంలోనే ఆర్యవైశ్యులకు పెద్దపీట వేస్తుందని, ఇటీవల శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం దేవాలయాల్లో ఆర్యవైశ్యులకు స్థానం కల్పించారని ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్ అన్నారు. మంగళవారం స్థానిక వాసవి చౌక్‌లో మంగళవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమరావతిలో 58అడుగుల పొట్టిశ్రీరాములు విగ్రహంతో పాటు స్మారక భవనాన్ని 6.8 ఎకరాల్లో నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించిందన్నారు. అదే విధంగా శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్ణయించాలని సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. జవ్వాజి గంగారాజు, సూరే గాంధీ, తిరువీధి సుబ్బారావు, బెజవాడ బాజేశ్వరరావు, ముప్పిడి ఉమా, బి.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన

● ఆర్.వెంకటరావు

నందివాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనేదే ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం ముఖ్యోద్దేశ్యమని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్, నందివాడ మండల ప్రత్యేకాధికారి ఆర్.వెంకటరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వెలుగు పథకం కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన విధాన మెరుగుదల కోసం కుటుంబ ఆర్థిక స్థితిగతులపై ఎంఎస్ఎంఈ పాలసీ మొదలైన ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కుటుంబంలో ఎవరైనా పరిశ్రమ పెట్టదలచినవారు కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ లింక్ ద్వారా ఎలాంటి రుసుములను చెల్లించాల్సిన అవసరం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. ఎంపీడీవో మల్లేశ్వరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

బాస్కెట్‌బాల్ పోటీలకు మాంటిస్సోరి విద్యార్థులు



రాష్ట్రజట్టుకు ఎంపికైన మాంటిస్సోరి విద్యార్థులు

గుడివాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాష్ట్ర బాస్కెట్‌బాల్ జట్టుకు స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.పద్మావతి తెలిపారు. మంగళవారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన నూజివీడు టీఐఎస్ పాఠశాలలో జరిగిన అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థి జి.రాకేష్ వీరమాధవ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో మరో విద్యార్థి జైబున్నీసా స్టాండ్‌బైగా ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రజట్టుకు ఎంపికైన విద్యార్థులను మహిళా సంఘం కార్యవర్గ సభ్యులు, పాఠశాల వ్యాయామోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, యమ్. సత్య అన్వేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదవర్గాలకు మేలు

● ఎంపీడీవో కె.జ్యోతి

పామర్రు,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పేదవర్గాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించడం కోసం ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తెచ్చిన సూపర్ జీఎస్టీతో అన్నివర్గాల ప్రజలకు పెద్ద ఎత్తున మేలు జరగనున్నదని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. పట్టణంలో మంగలవారం జీఎస్టీ సంస్కరణల లాభాలను వినియోగదారులకు, దుకాణదారులకు వివరిస్తూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ ఏవోటీ మారుతిరావు, డిప్యూటీ ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులుసలీం, నరేష్, బోసు, పాల్గొన్నారు.



పామర్రులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో జ్యోతి



పమిడిముక్కలలో..

పమిడిముక్కల : జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చింద ని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆధ్వర్యంలో మంగళవారం వీరంకిలాకులో జీఎస్టీ తగ్గింపుపై వీరంకిలాకులో నిర్వహించిన అవగాహనలో మంత్రి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. మొవ్వ ఏఎంసీ చైర్మన్ డి.శివరామకృష్ణ, ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

గుడివాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : స్థానిక రాజేంద్రనగర్‌కు చెందిన తలారి వెంకట గంగాధరరావు ఆగస్టు 24వ తేదీన తన ద్విచక్రవాహనాన్ని గుడివాడ బస్టాండ్‌లో పెట్టి విజయవాడ వెళ్లాడు. రాత్రి 9గంటల సమయంలో వచ్చి చూడగా, తన బైక్ కనిపించలేదు. వెతుకులాడి ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ పి.బాబురావు తెలిపారు.

పంచాయతీ నూతన కార్యవర్గం

నందివాడ : కృష్ణా జిల్లా పంచాయతీ యూనియన్ సెక్రటర్ల నూతన కమిటీలో భాగంగా నందివాడ మండలం అనమనపూడి పంచాయతీ కార్యదిర్శ పుసునూరు రమేష్‌బాబు ఏకగ్రీవంగా ఎంపికైనట్టు నందివాడ పంచాయతీ కార్యదర్శులు అధ్యక్షుడు సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా నందివాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో మల్లేశ్వరి ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన రమేష్ బాబుకు పంచాయతీ కార్యదర్శులు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.

పెదఎరుకపాడులో చోరీ

గుడివాడ : స్థానిక పెదఎరుకపాడుకు చెందిన పెయ్యల నాని మంగళవారం తాపీ పని నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. నాని భార్య సైతం ఉదయం 6గంటలకు స్థానిక ఏలూరురోడ్డులోని చర్చికి వెళ్లింది. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన నానికి ఇంటి గేటు, ఇంటి తాళం పగలకొట్టి ఉండటాన్ని గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగలకొట్టి అందులో డ్వాక్రాకు సంబంధించిన రూ.22,250లు కనిపించలేదు. దీంతో నాని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై వి.జాస్మిన్ తెలిపారు.

నూతన ఉపాధ్యాయులకు అభినందనలు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలానికి కొత్తగా 8 మంది ఉపాధ్యాయులు వచ్చారు. పెనమకూరు జడ్పీ హైస్కూల్, గరికపర్రు జడ్పీ హైస్కూల్, వల్లూరుపాలెం పాఠశాలలో 8 మంది కొత్త టీచర్లు రాగా మంగళవారం జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు పీకా ఇమ్మానుయేలు, మండల ఎస్టీయూ అధ్యక్షుడు ఐ. నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా కమిటీ సభ్యురాలు ఎస్ శ్రీలత, బాల ప్రసాదరాజు ఆయా పాఠశాలలకు వెళ్లి వారిని పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. అనంతరం ప్రొఫార్మాలు, సీఎల్ రిజస్టర్‌లు, ఎస్టీయూ కరపత్రాలను అందించారు.

మచిలీపట్నం

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550



మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం మునిసిపల్ కార్మికులు నవంబరు 3వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నట్టు ఏఐటీయూసీ నేత మోదుమూడి రామారావు తెలిపారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజును మంగళవారం కలిసి సమ్మె నోటీసు అందజేశారు. యర్రంశెట్టి ఈశ్వరరావు, కర్నాటి అర్జునరావు, యర్రంశెట్టి శ్రీమన్నారాయణ, సంగంరెడ్డి కోటేశ్వరరావు, గోపీ, సిద్దిరెడ్డి, మౌలాలి, కార్మికులు పాల్గొన్నారు.

కాకర్లమూడిపాలెం బడిలో నేలమీదే పాఠాలు

● బల్లలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులు



బల్లలు లేక నేలమీద కూర్చుని చదువుకుంటున్న చిన్నారులు

పెడన రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కాకర్లమూడి పాలెం ప్రాథమిక పాఠశాలలో కూర్చునేందుకు బల్లలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. 53 మంది పాఠశాలలో ఉండగా, మౌలిక వసతుల కల్పనకు నాడు-నేడు రెండో దశలో పొందుపర్చారు. నిధుల కొరత కారణంగా పాఠశాల అభివృద్ధికి నోచుకోలేదని తల్లిదండ్రులు తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు స్వచ్ఛంద సంస్థల సాయం కోరుతున్నామని ప్రధానోపాధ్యా యురాలు కె.వి. మహలక్ష్మి తెలిపారు. మండలంలో ఇటీవల మూతపడిన పాఠశాలలోని బల్లలను కాకర్లమూడిపాలెం పంపి సమస్యను పరిష్కరిస్తామని ఎంఈవో హరనాథ్ తెలిపారు.

జిల్లాకు వంగవీటి రంగా పేరు పెట్టాలి

● ఎంపీ బాలశౌరికి జనసేన నేత బుల్లెట్ ధర్మారావు వినతి



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాకు దివంగత వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని ఎంపీ వల్లభనేని బాలశౌరిని రాధా రంగ మిత్రమండలి ఆంధ్రా, తెలంగాణా అధ్యక్షుడు, జనసేన నాయకుడు, బుల్లెట్ ధర్మారావు కోరారు. ఎంపీ బాలశౌరిని ఆయన మర్యా దపూర్వకంగా కలిసిఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ, ఈ అంశాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళతానన్నారు. రాధారంగ మిత్రమండలి నాయకులు గంగిశెట్టి బాబూరాజేంద్రప్రసాద్, రాయగిరి శ్రీరామ్‌మోహనరావు, చలమలశెట్టి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నం డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా యాకూబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెవెన్యూ డివిజన్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో గౌరవ అధ్యక్షురాలిగా డి.కనకదుర్గ, ఉపాధ్యక్షులుగా కె.అనిల్‌కుమార్, ఎల్‌వీఎన్‌ఆర్‌కె శశికుమార్, పి.కల్పన, కార్యదర్శిగా కె.శివప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా కె.జి.ఎస్ సాయి, సిహెచ్ చంద్రశేఖర్, జి.మంజుల కోశాధికారిగా బి.శివశంకర్, కార్యవర్గ సభ్యులుగా విశ్వనాథ్, కె.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. వీరు మూడేళ్లపాటు ఈ పదవిలో ఉంటారు. ఎం.హరనాథ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.



ఆధ్యాత్మికవేత్తలు, సేవకులకు ఘనసత్కారం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సువర్చలా సమేత ఆంజనేయస్వామి దేవాలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వారం రోజులుగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ వడ్లమన్నాటి మారుతి దివాకర్‌శర్మచే నిర్వహిస్తున్న సుందరకాండ ప్రవచనం మంగళవారంతో ముగిసింది. ముళ్లపూడి వెంకట సీతాపతిరావు సంగీత కచేరీ అలరించింది. మారుతీదివాకరశర్మతో పాటుగా సమాజసేవ చేస్తున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా ప్రతినిధి శ్రీరామ్, రెడ్‌క్రాస్ సభ్యుడు వి.సుందరరాం, ఆలయ పాలక మండలి చైర్మన్ ఆలపాటి రమేష్‌లను బ్రాహ్మణ సేవా సంఘం తరఫున గొర్రెపాటి గోపీచంద్ ఘనంగా సత్కరించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలపాటి రమేష్, మెంబర్లు ఎం.ఉమాదేవి, విశ్వనాథపల్లి నాగరాజు, నందిపాముల శ్రీనివాస్, ఐల శివ నాగేశ్వరరావు, కనకదుర్గ, రాజేష్, కోస్తా మురళీకృష్ణ, ఎం.సుబ్రహ్మణ్యం, పి.వి. ఫణికుమార్, సేతురామయ్య, కానుకొలను ఫణి కిరణ్‌శర్మ, భవిష్య, అద్దేపల్లి విశ్వేశ్వర శాస్త్రి పాల్గొన్నారు.



లక్ష్య పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి

దివిసీమ ఖ్యాతిని చాటాలి : ఎమ్మెల్యే మండలి

కోడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదలతో చదివి విద్యార్థులు దివిసీమ ఖ్యాతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. లక్ష్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 10వ వార్షికోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్ విచ్చేశారు. తీర ప్రాంత ప్రజలకు ఉత్తమమైన విద్యను అందించాలనే లక్ష్యంతో విద్యాసంస్థను నిర్వహిస్తున్న కరస్పాండెంట్ విస్సంశెట్టి నాగరాజు, ప్రిన్సిపాల్ విస్సంశెట్టి సుబ్రహ్మణ్యంలను అభినందించారు. విద్యార్థులు దేశభక్తిని చాటే ప్రదర్శనతో అలరించారు.సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.




రుద్రవరంలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఘంటసాలలో ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మౌలిక సదుపాయాలు కల్పించండి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని రుద్రవరం టిడ్కో హౌసింగ్ కాలనీ ప్రజలు కలెక్టర్ డీకే బాలాజీని కోరారు. కలెక్టర్ బాలాజీ మంగళవారం రుద్రవరంలోని టిడ్కో ఇళ్లను సందర్శించారు. అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు మౌలిక సమస్యలనను ఆయన దృష్టికితీసుకువచ్చారు. తహసీల్దార్ మధుసూదనరావు, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, ఎస్.రమేష్, హౌసింగ్, ఎలక్ట్రికల్, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఘంటసాలలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ఘంటసాల : ఘంటసాల-2 లేఅవుట్, ఘోటకం కాలనీ, ఘంటసాల దిరిశంవానిగూడెంలోని గృహ నిర్మాణాలను కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం పరిశీలించారు. ఘంటసాల-2 లేఅవుట్‌లో వసతులపై ఆరా తీశారు. హౌసింగ్ ఏఈ సురేంద్ర లే అవుట్‌లో జరిగిన ఇళ్ల నిర్మాణాల గురించి కలెక్టర్‌కు వివరించారు. లే అవుట్‌లో 257 నిర్మాణాలకు అనుమతులివ్వగా, 117 పూర్తయ్యాయని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. లే అవుట్‌లో రహదారుల అభివృద్ధి, మంచినీటి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు కలెక్టర్‌ను కోరారు. జల్ జీవన్ మిషన్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిన కలెక్టర్ మిగిలిన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణ సంస్థ జెడి పోతురాజు, తహసీల్దార్ విజయప్రసాద్, ఎంపీడీవో సుబ్బారావు, హౌసింగ్ ఈఈ బుచ్చిబాబు, డీఈ చిన్నబాబు, ఏఈ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్



టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

అవనిగడ్డ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల సంక్షేమమే లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆరు మండలాల కార్యకర్తలు భారీగా తరలివచ్చి మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు సమస్యలను విన్నవించారు. వైసీపీ అక్రమాలపై తాము ధీటుగా పోరాడినప్పటికీ నామినేటెడ్ పదవుల విషయంలో అన్యాయం జరిగిందని కొందరు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించి మంత్రి సుభాష్ మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ఏ ఒక్కరినీ పార్టీ మరచిపోదన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం కసరత్తు జరుగుతోందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా అవనిగడ్డ సీటు జనసేనకు కేటాయించడంతో పార్టీ ఇన్‌చార్జి కావాలన్న డిమాండ్ వచ్చిందని, అధినాయకత్వం కసరత్తు ప్రారంభించిందని తెలిపారు. వివిధ సమీకరణాల మేరకు నామినేటెడ్ పదవుల నియామకం జరిగిందన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, ఇన్‌చార్జి లేకపోవటంతో కార్యకర్తలు కొంత అసంతృప్తిగా ఉన్నారని, అధినాయకత్వం త్వరలో సమస్యను పరిష్కరిస్తుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అధికారుల వ్యవహార శైలిలో మార్పు రావాలని సూచించారు. సుభాష్ స్పందిస్తూ త్వరలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొ ల్లూరి వెంకటేశ్వరరావు, మల్లిఖార్జునరావు, బండే శ్రీనివాసరావు, లక్ష్మణరావు, మోర్ల రాంబాబు, యాసం చిట్టిబాబు, మాచవరపు ఆదినారాయణ, తలశిల స్వర్ణలత, పైడిపాముల కృష్ణకుమారి, కర్రా సుధాకర్, రావి నాగేశ్వరరావు, బోలెం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దొంగే..దొంగ..దొంగ అనే చందంగా వైసీపీ : యార్లగడ్డ

చల్లపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం విషయంలో దొంగే..దొంగ..దొంగ అన్నట్లుగా వైసీపీ వ్యవహరిస్తోందని టీడీపీ సీనియర్ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు విమర్శించారు. చల్లపల్లిలో మంగళవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతి..అరాచకం..నకిలీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వైసీపీ పాలన సాగిందని దుయ్యబట్టారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాతే నకిలీ మద్యం పుట్టిందన్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. జోగి రమేష్ ద్వారా నకిలీ మద్యం తయారీ అంశం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిందన్నారు. దోషులందరినీ కఠినంగా శిక్షించాలని ప్రభుత్వా న్ని కోరారు. ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రను రాజీనామా చేయాలనే అర్హత పేర్ని నానికి లేదన్నారు. జగన్ బెయిల్ రద్దు కోసం టీడీపీ శ్రేణులు కోటి సంతకాల సేకరణ చేసి ప్రధాన న్యాయమూర్తికి పంపితే బావుంటుందని అన్నారు. సమావేశంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, సొసైటీ చైర్‌పర్సన్ గుత్తికొండ వంశీకృష్ణ ఉన్నారు.

పేర్ని నానీ..నోరు అదుపులో పెట్టుకో : గోపీచంద్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకోవాలని, ఏది పడితే అది వాగితే చూస్తూ ఊరుకోమని టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ హెచ్చరించారు. టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కుదిరితే అభివృద్ధికి సహకరించాలని, లేకపోతే ఇంట్లో కూర్చుని రాజకీయ రిటైర్మెంట్ తీసుకుని ఎంజాయ్ చేయాలని హితవు పలికారు. మంత్రి కొల్లు రవీంద్రపై ఇష్ట వచ్చినట్టు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ దిలీప్‌కుమార్, లోగిశెట్టి వెంకటస్వామి, పిప్పళ్ల కాంతారావు (వెంకన్న) తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం చలామణీలో లేదు

● విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సీఐ గిరిజ



అవనిగడ్డ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గంలో నకిలీ మద్యం చలామణిలో లేదని ఎక్సైజ్ సీఐ గిరిజ తెలిపారు. అవనిగడ్డలోని ఎక్సైజ్ కా ర్యాలయంలో మంగళవారం ఆమె విలే కరులతో మాట్లాడారు. నియోజక వర్గానికి చెందిన తుంగల సుధాకర్ మద్యం కేసులోని నిందితుడు అద్దేపల్లి జనార్దన రావుకు హైదరాబాద్‌లో బార్ నిర్వహణలో భాగస్వామి అని రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించారన్నారు. సుధాకర్ అవనిగడ్డ లోని ఏ వైన్ షాపులో గానీ, బార్‌లో గానీ లైసెన్సుదారుడు కాదని స్పష్టం చేశారు. గతంలో ఈలచెట్లదిబ్బ గ్రామంలో స్వాధీనం చేసుకున్న మద్యం డ్యూటీ పెయిడ్ లిక్కర్ అన్నారు. గుల్లలమోద గ్రామానికి చెందిన వ్యక్తిని విజయవాడ పోలీసులు అనకాపల్లి ప్రాంతంలో జరిగిన అక్రమ మద్యం ఘటనలో పట్టుకున్నారని, అతని నుంచి వచ్చి సమాచారంతో రేపల్లె ప్రాంతంలో అక్రమ మద్యం పట్టుకున్నారే గానీ నియోజకవర్గంలో ఎక్కడా నకిలీ మద్యం చెలామణి కాలేదన్నారు. ఎప్పటికప్పుడు సర్కిల్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. లిక్కర్ సిండికేట్‌తో కూడా సుధాకర్‌కు ఎలాంటి పాత్ర లేదని తమ విచారణలో వెల్లడైందని సీఐ గిరిజ తెలిపారు.

మధ్య తరగతికి రుణాలందిస్తా : దిలీప్‌కుమార్



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మధ్య తరగతి కుటుంబాలకు రుణ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామని మచిలీపట్నం అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు ఐ.దిలీప్‌కుమార్ అన్నారు. దిలీప్‌కుమార్‌ను టీడీపీ నాయకులు వేముల బుజ్జి తదితరులు మంగళవారం సత్కరించారు. దిలీప్‌కుమార్ మాట్లాడుతూ, అర్బన్ బ్యాంకును లాభాల దిశలో తీసుకువెళ్లేందుకు, డిపాజిట్ల సేకరణపై దృష్టి సారిస్తామన్నారు. స్వల్పకాలిక రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు ఇస్తామన్నారు. ఇళ్ల నిర్మించుకునేందుకు రుణ సౌకర్యం కల్పించేందుకు యోచిస్తున్నామన్నారు.

లక్ష్మణను ఆదర్శంగా తీసుకోవాలి : రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సైనికుడుగా పనిచేసి, పదవీ విరమణ అనంతరం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి మరణానంతరం తన శరీరాన్ని మెడికల్ కాలేజీకి అందజేసిన కొండదాసుల లక్ష్మణ అందరికీ ఆదర్శమని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. లక్ష్మణ చిత్రపటానికి బండి రామకృష్ణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ, లక్ష్మణ మృతి చెందినప్పటికీ ఆయన శరీరం పలు కార్యక్రమాలకు ఉపయోగపడిందన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, ఉపాధ్యక్షుడు మహమ్మద్ సమీర్, టీడీపీ నాయకులు రాయపూడి చిన్ని, రమణ, ఘంట వెంకట సురేష్ పాల్గొన్నారు.

షిర్డి యాత్రకు వెళ్తూ పోటుమీద వాసి మృతి



మృతుడు బాపనయ్య

కోడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోటుమీద గ్రామానికి చెందిన శీలం బాపనయ్య (65) షిర్డి యాత్రకు వెళ్తుండగా గుండెపోటుతో రైలులోనే మృతి చెందాడు. సోమవారం ఇంటి వద్ద నుంచి యాత్రికులతో కలిసి షిర్డి బయలుదేరి వెళ్లాడు. బాపనయ్యను మంగళవారం నాగర్‌సోల్ రైల్వేస్టేషన్‌లో తోటి యాత్రికులు నిద్రలేపగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. బాపనయ్య ఆకస్మాత్తుగా మృతి చెందటంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

ఘనంగా మహబూబ్ సుభానీ గ్యార్మీ వేడుక



చల్లపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్ సుభానీ గ్యార్మీ వేడుక చల్లపల్లి పడమర వైపు జెండా చెట్టు వద్ద మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ప్రవక్త మహబూబ్ సుభానీని స్మరించుకుంటూ గౌసేపాక్, ఖాజా గరీబుల్ నవాజ్‌ల నూతన జెండాలు ఏర్పాటుచేసి గంధం, ధుని సమర్పించారు. యువనేత మండలి వెంకట్రామ్, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్, నాటక అకాడమీ డైరెక్టర్ పైడిపాముల స్వప్న విచ్చేసి జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలి వెంకట్రామ్‌ను మైనార్టీ నేతలు సత్కరించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, సొసైటీ చైర్‌పర్సన్ బొందలపాటి వీరబాబు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, టీడీపీ నేతలు షేక్ సిలార్, రావి రాజేశ్వరరావు, మేడికొండ రవిబాబు, బావిశెట్టి కనకదుర్గ, దిల్షాద్ నజరానా, జనసేన నేతలు సూదాని నందగోపాల్, అడపా రవి, మండలి శివప్రసాద్, గుడివాక నరహరి పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి : వీసీ రాంజీ



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సంభాషణా నైపుణ్యం, భావ వ్యక్తీకరణ యువత పెంపొందించుకోవాలని కృష్ణ విశ్వవిద్యాలయం ఉపకులపతి కె. రాంజీ అన్నారు. కృష్ణ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో సంభాషణా నైపుణ్యాలు - విజయానికి ద్వారాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమంజరిగింది. ఉపకులపతి రాంజీ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయంలో విశిష్ట వ్యక్తులతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. త్వరలో ప్రాంగణ ఎంపికలు చేపడతామన్నారు. రిటైర్డు ఐఏఎస్ అధికారి జి కొండలరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పోటీ యుగంలో జీవితంలో విజయానికి నైపుణ్యాలు అత్యంత కీలకమన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు పాల్గొన్నారు.

కిరాణా షాపుల ముందు జీఎస్టీ తగ్గింపు బోర్డులు పెట్టాలి : ఎంపీడీవో

నాగాయలంక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగాయలంకలోని కిరాణా దుకాణాదారులు తగ్గించిన జీఎస్టీ నిత్యావసర వస్తువులు ధరలతో డిస్ ప్లే బోర్డులు పెట్టాలని ఎంపీడీవో డి.వెంగళరావు ఆదేశించారు. పాత ధరలు, కొత్త ధరలతో రెండు రోజుల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని దుకాణదారులను కోరినట్లు తెలిపారు. డిస్ ప్లే బోర్డులు ఏర్పాటు చేయని దుకాణాలదారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోదుమూడిలో అన్నదానం

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మోదుమూడి ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో నాలుగు వారాలుగా హనుమాన్ చాలీసా పారాయణ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం మూడు వేల మందికి అన్నసమారాధన జరిపారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

మోపిదేవి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సిహెచ్.వాసు, బి.వి.సుధాకర్ ఆధ్వర్యంలో డీఈఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ సిబ్బంది తనిఖీలు చేశారు. అదనపు లోడ్ వాడుకొంటున్న 288 సర్వీసులు గుర్తించి రూ .8.74 లక్షలు, విద్యుత్ చౌర్యం చేస్తున్న సర్వీసులు గుర్తించి రూ.20 వేల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

పాలకాయితిప్పలో కమ్యూనిటీ అవేర్‌నెస్

కోడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకే కమ్యూనిటీ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాలకాయితిప్ప మెరైన్ ఎస్సై పూర్ణమాధురి తెలిపారు. ఉల్లిపాలెం కమ్యూనిటీ హాల్‌లో మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. వేట సమయంలో సమస్యలు తెలియపర్చాలన్నారు. ఎస్సై చాణిక్య, షిషరీష్, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు

గూడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు లాభం చేకూరుతుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జీఎస్టీ సంస్కరణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ తగ్గించడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయన్నారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, ఎంపీడీవో శైలజాకుమారి, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, పంచకర్ల సురేష్, గోపీ నాగబాబు, ఎస్‌ఏ బేగ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శలపాటి ప్రసాద్‌కు పరామర్శ

పెడన, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్న అనంతరం స్వగ్రామం కొంకేపూడి వచ్చిన రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు శలపాటి ప్రసాద్‌ను టీడీపీ నాయకులు పరామర్శించారు. బొడ్డు వేణుగోపాలరావు, శ్యామలయ్య, వహబ్ ఖాన్, అబ్దుల్ ఖదీర్, హమీదుల్లా పరామర్శించారు.